www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO.APTEL/2010/33229

**విలేకరులు కావలెను**

18సం॥ లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల, మండలాల వారీగా విలేకరులు కావలెను..

★ ఆసక్తి గల అభ్యర్థులు సంప్రదించవలసిన నంబర్ ★

సెల్ నెంబర్: 9951494039

సంపుటి : 17 | సంచిక : 186 | మంగళవారం 01.09.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/-

## మోడీతో ఇరాన్ అధ్యక్షుడు భేటీ..

### మోదీ-పుతిన్ భేటీకి రంగం సిద్ధం?

- ఫిబ్రవరిలో యుద్ధం తర్వాత తొలిసారి ముఖాముఖి..
- ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేయడంపై దృష్టి..
- అమెరికా-ఇరాన్ యుద్ధం వేళ మోదీ భేటీకి ప్రాధాన్యం..
- పశ్చిమాసియా ఉద్రిక్త పరిస్థితులపై నేతల చర్చ..
- పశ్చిమాసియా పరిస్థితులపై పెజెష్కియాన్‌తో చర్చలు..
- ఆంక్షల వేళ భారత్-ఇరాన్ వాణిజ్యంపై ఆందోళన..

02

శాశ్వత శాంతి, స్థిరత్వానికి కృషి అవసరమన్న మోదీ..



## 2027 ఏప్రిల్ నాటికి గద్వాల రైల్వే అభివృద్ధి...

గద్వాలకు రూ.66 కోట్లతో మరో ఆర్‌ఓబీ..

- 42 రైల్వే స్టేషన్లను ఒకేసారి అభివృద్ధి చేస్తున్నాం: కిషన్‌రెడ్డి
- మోదీ పాలనలో రైల్వే రంగానికి కొత్త వేగం..
- ఏడాదికి రూ.5,454 కోట్లతో తెలంగాణలో అభివృద్ధి పనులు..

03

గత పదేళ్లలో తెలంగాణ రాష్ట్రానికి 100 కొత్త రైళ్లను మంజూరు చేసినట్లు కిషన్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని రైల్వే లైన్ల విద్యుదీకరణ పనులను పూర్తి చేశామని చెప్పారు. ప్రయాణికుల సౌకర్యార్థం తెలంగాణలోని 174 రైల్వే స్టేషన్లలో హైస్పీడ్ ఉచిత వైఫై సదుపాయం కల్పించినట్లు వెల్లడించారు.



# మహానగరంలో మరో ఘాతుకం..

## తుక్కుగూడ నర్సు శిరీష హత్య కేసు..

- రూమ్‌మేట్స్ ఊళ్లకు వెళ్లడంతో ఒంటరిగా శిరీష
- అర్ధరాత్రి హాస్టల్‌లోకి చొరబడిన నిందితుడు
- కిటికీ గ్రిల్స్ లేని చోటు నుంచి గదిలోకి ప్రవేశం
- కేకలు వేయడంతో గొంతు నులిమి హత్య చేసినట్లు విచారణలో వెల్లడి
- కార్ల మెకానిక్ సనావుల్లా అదుపులో
- విచారణలో నేరాన్ని అంగీకరించినట్లు పోలీసుల వెల్లడి
- కొంతకాలంగా నర్సుల కదలికలపై నిందితుడి నిఘా
- శిరీష ఒంటరిగా ఉన్న విషయాన్ని గమనించినట్లు గుర్తింపు

05



తుక్కుగూడలో 21 ఏళ్ల నర్సు శిరీష హత్య కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. రాఖీ సందర్భంగా తోటి నర్సులు స్వగ్రామాలకు వెళ్లడంతో శిరీష హాస్టల్ గదిలో ఒంటరిగా ఉన్న సమయంలో ఈ ఘటన జరిగింది. ఆస్పత్రి సమీపంలోని కార్ల మెకానిక్ షాపులో పనిచేసే మహ్మద్ సనావుల్లా ఆమెపై లైంగిక దాడికి ప్రయత్నించి, శిరీష ప్రతిఘటించడంతో గొంతు నులిమి హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు.

పోస్టుమార్టం నివేదికలో కీలక విషయాలు

శిరీషపై లైంగిక దాడి జరిగినట్లు నిర్ధారణ

## ఢిల్లీలో నిర్భయ తరహా దారుణం



- కదులుతున్న స్లీపర్ బస్సులో 16 ఏళ్ల బాలికపై దారుణం
- బస్సు తెరలు దించి.. బాలికపై అఘాయిత్యం
- కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో నిందితుల అరెస్ట్
- డ్రైవర్, కండక్టర్ కలిసి అత్యాచారం..
- 47 కి.మీ ప్రయాణంలో అమానుష ఘటన..

05

# నన్ను బెదిరిస్తున్నారు..

## నాతో కేసీఆర్ కు పోలికేంటి.?

## నక్కకు నాగలోకానికి.. నందికి పందికి ఉన్నంత తేడా ఉంది

### రిటైర్మెంట్ వయసు పెంచి భారం మాపై వేశారు

### మహిళలకు ఉచిత బస్సు పథకంపై ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టారు

- బీఆర్ఎస్ హయాంలో ఉద్యోగులకు సక్రమంగా జీతాలు ఇవ్వలేదు
- తాము వచ్చాక ఒకటో తేదీనే ఉద్యోగులకు జీతాలు: సీఎం రేవంత్‌రెడ్డి
- వెయ్యి రోజుల ప్రజాపాలనపై అల్లరి మూకలు బురద జల్లుతున్నాయి
- విధ్వంసమైన తెలంగాణను వికాసం వైపు తీసుకెళ్తున్నాం: సీఎం
- తెలంగాణను అప్పుల కుప్పగా మార్చింది బీఆర్ఎస్
- పదేళ్లలో రూ.8 లక్షల కోట్ల అప్పు చేసి వెళ్లారు: రేవంత్‌రెడ్డి
- పాత బకాయిలు రూ.8 వేల కోట్లు నా నెత్తిన పెట్టారు
- రిటైర్మెంట్ ఉద్యోగుల బకాయిల కోసం రూ.600 కోట్లు చెల్లించాం
- ఉద్యోగుల సమస్యలపై సంఘాలతో పదిసార్లు చర్చించాం
- ఆరోగ్య భద్రత కార్డులను పునరుద్ధరించాం: సీఎం
- ప్రజల ఆస్తులు కాపాడుతున్నది కాంగ్రెస్ ప్రభుత్వం
- కబ్జాలు చేస్తున్నది ఎవరో ప్రజలకు తెలుసు: రేవంత్‌రెడ్డి

02

60 ఏళ్లకు పైగా పాలించినా రాష్ట్ర అప్పులు రూ.70 వేల కోట్లు

కేసీఆర్ మాత్రం తొమ్మిదేళ్ల పాలనలో రూ.8.11 లక్షల కోట్లకు తీసుకెళ్లారు

గంట కూడా పని చేయకుండా కోటి 24 లక్షల జీతమా? కేసీఆర్ రాజీనామా చేయాలి: సీఎం రేవంత్

మూడు కార్పొరేషన్లకు కొత్త లోగోలు








## హైదరాబాద్ ప్రజలకు ఊరట


మూసీపై కొత్త హైలెవెల్ బ్రిడ్జి ప్రారంభం

రూ.52 కోట్లతో 400 మీటర్ల పొడవున నిర్మాణం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం



## మజ్లిస్‌లో ధిక్కార స్వరం..



- మజ్లిస్‌కు తలనొప్పిగా రహ్మత్ బేగ్ వ్యవహారం..
- రాజీనామా ఆదేశాలను బేఖాతరు చేస్తున్న ఎమ్మెల్సీ..
- బాలికపై లైంగిక వేధింపుల ఆరోపణలతో సస్పెన్షన్..
- 'నేను ఏ తప్పూ చేయలేదు' అంటూ రహ్మత్ బేగ్ ప్రకటన..

03

## మార్పు దిశగా తెలంగాణ రాజకీయం..

### మార్పులో నా పాత్ర కీలకం: రాజగోపాల్‌రెడ్డి

- పేదలకు సేవ చేయడమే లక్ష్యంగా రాజకీయ మార్పు..
- నిజాయితీపరులను అసెంబ్లీకి తీసుకొస్తానన్న ఎమ్మెల్యే..
- 'డబ్బుల కోసం రాజకీయాల్లోకి వచ్చినవారు శాశ్వతం కాదు'
- డబ్బే కావాలంటే వ్యాపారం చేసుకోవాలని హితవు..
- అవినీతితో మొత్తం వ్యవస్థ కలుషితమైంది..

03



# వెలిగొండ ప్రాజెక్టును జాతికి అంకితం

## మూడు దశాబ్దాల కల సాకారం..

### కరువు ప్రాంతాలకు కొత్త జీవం.. వెలిగొండ జలసిరులు



కరువు ప్రాంతాలకు కొత్త జీవం.. వెలిగొండ జలసిరులు

నల్లమలసాగర్‌కు కృష్ణా జలాల విడుదల..

- 4 లక్షల మందికి తాగునీరు అందించే దిశగా అడుగులు..
- శ్రీశైలం నుంచి 43.53 టీఎంసీల కృష్ణా జలాల మళ్లింపు..
- నల్లమల కొండల గుండా సరికొత్త జల ప్రస్థానం..
- దశాబ్దాల నిరీక్షణకు తెరదించిన వెలిగొండ ప్రాజెక్టు..
- రూ.768 కోట్ల పరిహారంతో నిర్వాసితులకు ఊరట..
- పనులు వేగవంతం చేసి తొలి దశను పూర్తి..
- ఈలలు.. కేరింతలతో మార్మోగిన వెలిగొండ సభ..
- జానపద గీతానికి యువత డ్యాన్సులతో సందడి..
- 'ఏషనాగుల నాగుల కట్టమీద' పాటకు జనం ఫిదా..

02

## నేను పిరికిదాన్ని కాదు

### పాంచజన్య సభలో బోరున విలపించిన కవిత

కాళేశ్వరంతో నిజామాబాద్‌కు ఏం లాభం?

**పుట్టింటి నుంచి బయటకు పంపారు**

సంతోష్, హరీశ్‌లను క్షమిస్తా కానీ ప్రశాంత్ రెడ్డిని వదలను

- పార్టీ నుంచి సస్పెన్షన్‌పై కవిత కన్నీరు
- కవిత సభలో భావోద్వేగ సన్నివేశం
- కన్నీళ్లు బలహీనతకు చిహ్నం కాదు
- పుట్టింటి నుంచి బయటకు పంపారు
- తీహార్ జైలుకు పంపిన వారికి బదులిస్తా
- తెలంగాణకు కొత్త రాజకీయ శక్తి అవసరం

03



## ఏపీకి కృష్ణాజలాల తరలింపేంటి?

పాలమూరు.. నల్లగొండ.. రంగారెడ్డి రైతాంగానికి అన్యాయం..

- కృష్ణాజలాల తరలింపుపై రేవంత్ సర్కార్ మౌనం..
- తెలంగాణకు తీరని ద్రోహం చేస్తున్నారంటూ హరీశ్‌రావు ధ్వజం..
- తెలంగాణ ఆయకట్టు ఎండుతుంటే.. ఏపీకి నీటి తరలింపా?
- బేసిన్ దాటి నీటి తరలింపుపై హరీశ్‌రావు ఆగ్రహం..
- బీమా.. కల్వకుర్తి.. నెట్టెంపాడు.. కోయిల్‌సాగర్‌కు నీటి కష్టాలు..
- మన ప్రాజెక్టులు ఎండుతుంటే ఏపీకి నీళ్లు ఎలా?

03



# వెలిగొండ ప్రాజెక్టును జాతికి అంకితం

**గంటవానిపల్లి,ఫ్లాష్ ఇండియా :** మార్కాపురం జిల్లా గంటవానిపల్లిలో వెలిగొండ ప్రాజెక్టును సీఎం చంద్రబాబు ప్రారంభించారు. కృష్ణా నీటికి జలహారతి ఇచ్చి పైలాన్‌ను ఆయన ఆవిష్కరించారు. 30 ఏళ్ల క్రితం ఈ ప్రాజెక్టుకు ఆయన శ్రీకారం చుట్టారు. తొలిదశ పూర్తి అయింది. దీంతో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరిగింది. ఈ ప్రాజెక్టు ద్వారా నల్లమల్ల సాగర్‌కు కృష్ణానీళ్లను విడుదల చేశారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు, వైఎస్ఆర్ కడప జిల్లాల్లోని మెట్ట ప్రాంతాల రైతులకు సాగు నీరు అందనుంది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జాతికి అంకితం చేశారు. శ్రీశైలం జలాశయం నుంచి 43.53 టీఎంసీల కృష్ణా వరద జలాలను నల్లమల కొండల గుండా మళ్లించి, మొత్తం 4,47,300 ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో వెలిగొండ ప్రాజెక్టును రూపొందించారు. మార్కాపురం జిల్లాలో 3,08,700 ఎకరాలు, ప్రకాశం జిల్లాలో 27,400 ఎకరాలు, వైఎస్ఆర్ కడప జిల్లాలో 27,200 ఎకరాలు, నెల్లూరు జిల్లాలో 84,000 ఎకరాలకు సాగునీరు అందేలా ప్రాజెక్టు రూపకల్పన జరిగింది. ఈ ప్రాజెక్టు ప్రారంభోత్సవంతో దశాబ్దాలుగా తీవ్ర కరువును ఎదుర్కొంటున్న మార్కాపురం జిల్లా ప్రజల చిరకాల స్వప్నం సాకారం అయింది. వెలిగొండ సాగునీటి ప్రాజెక్టు తొలి దశను సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. వెలిగొండ ప్రాజెక్టుతో మార్కాపురం ప్రాంతంతో పాటు ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని కరువు ప్రభావిత ప్రాంతాలకు కొత్త జీవం పోశారు. ముఖ్యంగా 30 ఏళ్ల క్రితం 1996 మార్చి 5న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. మూడు దశాబ్దాల తర్వాత అదే ప్రాజెక్టు తొలి దశను స్వయంగా ప్రారంభించారు. 'వెలిగొండ జలసిరులు-అభివృద్ధికి రెక్కలు' పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

**తొలిదశతో కొత్త అధ్యాయం..**

తొలి దశ ప్రారంభం ద్వారా 10.70 టీఎంసీల కృష్ణా జలాలను నల్లమలసాగర్‌కు విడుదలకు శ్రీకారం చుట్టారు. తొలి విడతలో సుమారు 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి తాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేసింది.

**30 ఏళ్ల ప్రయాణం.. సంకల్పం నుంచి సాకారం వరకు..**

1996లో శంకుస్థాపన చేసిన వెలిగొండ ప్రాజెక్టు ప్రయాణంలో ఎన్నో సాంకేతిక, ఆర్థిక, నిర్మాణపరమైన సవాళ్లు ఎదురయ్యాయి. సొరంగాల నిర్మాణం, ఫీడర్ కాలువలు, హెడ్ రెగ్యులేటర్లు, భూసేకరణ, పునరావాసం వంటి క్లిష్టమైన అంశాలను అధిగమిస్తూ ప్రాజెక్టు పనులు ముందుకు సాగాయి. 2024లో కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన అనంతరం వెలిగొండను అత్యంత ప్రాధాన్యతా ప్రాజెక్టుగా తీసుకుని పనులను వేగవంతం చేసింది. టన్నెల్ పనులు, ఫీడర్ కాలువలు, హెడ్ రెగ్యులేటర్లు, ఇతర అనుబంధ నిర్మాణాలతో పాటు నిర్వాసిత కుటుంబాలకు పునరావాసం, పరిహారం చెల్లింపులపై ప్రత్యేక దృష్టి సారించింది. కేవలం 48 రోజుల వ్యవధిలో నిర్వాసిత కుటుంబాలకు రూ.768 కోట్ల మేర పరిహారం చెల్లింపులు జరపడం ద్వారా పనులకు వేగం తీసుకువచ్చింది. అంతేకాకుండా గెజిట్, జాబితాలో పేర్లు లేని వారికోసం మరో రూ.169 కోట్లు, 2019 తర్వాత 18 ఏళ్ల నిండిన వారికి రూ.2 లక్షల చొప్పున పరిహారం ప్రకటించింది. 'శంకుస్థాపన చేసింది చంద్రబాబు... ప్రారంభించింది ఆయనే' కావడంతో అరుదైన చారిత్రక ఘట్టానికి ఈ రోజు వేదిక కానుంది. 30 ఏళ్ల క్రితం చేసిన సంకల్పం ఇప్పుడు సాకారమవడంతో మార్కాపురం ప్రాంత ప్రజల్లో ఆనందం వ్యక్తమైంది..

**ఈలలు, కేరింతలతో ఊగిపోయిన జనం..**

అయితే, కార్యక్రమం ప్రారంభంలో సదరు లేడీ సింగర్, తెలంగాణ ఫోక్ సింగర్ జంగిరెడ్డి రచించి పాడిన 'ఏషనాగుల నాగుల కట్టమీద' అనే జానపద పాటను అందుకోగానే సభలో ఉన్న వారంతా ఒక్కసారిగా కేరింతలు కొట్టారు. పాటలోని ఊపుకు వేదిక ముందున్న ప్రజలు, యువత లేచి నిలబడి ఉత్సాహంగా డాన్సులు వేశారు. సభలో వ్యక్తమైన ఈ ఉత్సాహాన్ని సీఎం చంద్రబాబు సైతం నవ్వుతూ ఆస్వాదించారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియోలు నెట్టింట విపరీతంగా వైరల్ అవుతున్నాయి. ఇక ప్రస్తుతం సోషల్ మీడియాను ఊపేస్తున్న ఈ 'ఏషనాగుల నాగుల కట్టమీద' జానపద గీతం నాచురల్ స్టార్ నాని నటిస్తున్న నూతన చిత్రం 'ప్యారడైజ్' మూవీ ద్వారా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఇప్పటికే ఈ పాట సోషల్ మీడియాలో, రీల్స్‌లో కోట్లలో లైక్స్, లక్షల్లో వ్యూస్‌తో విపరీతమైన ప్రజాదరణ పొందుతోంది.

# నన్ను బెదిరిస్తున్నారు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ నగరంలో మౌలిక వసతుల కల్పనలో భాగంగా మూసీ నదిపై నూతనంగా నిర్మించిన ముసారాంబాగ్ హైలెవెల్ బ్రిడ్జిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించి జాతికి అంకితం చేశారు. రూ.52 కోట్ల వ్యయంతో 400 మీటర్ల పొడవున జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నిర్మించిన ఈ బ్రిడ్జి అందుబాటులోకి రావడంతో స్థానిక ప్రజల నిరీక్షణకు తెరపడింది. వర్షాకాలంలో మూసీ నది ఉప్పొంగినప్పుడలా పాత వంతెన నీటమునిగి తీవ్ర ట్రాఫిక్ స్తంభన ఎదురయ్యేది. భవిష్యత్తులో ఎంతటి భారీ వరదలు వచ్చినా రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఈ హైలెవెల్ బ్రిడ్జిని ప్రత్యేక ఇంజినీరింగ్ ప్రమాణాలతో రూపొందించారు. ఈ బ్రిడ్జి ప్రారంభంతో ముసారాంబాగ్, అంబర్పేట్, మలక్పేట్, చదర్ ఘాట్ పరిసర ప్రాంతాల ప్రజలకు గంటల తరబడి ఎదురయ్యే ట్రాఫిక్ కష్టాల నుంచి శాశ్వత ఉపశమనం లభించనుంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలతో పాటు హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తదితర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. బీఆర్ఎస్ హయంలో ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు సక్రమంగా ఇవ్వలేదని, అదే తాము అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఒకటో తేదీనే జీతాలు ఇస్తున్నామని, అయినా ప్రభుత్వ ఉద్యోగులు తనను బెదిరిస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఇవాళ సీఎం అంబర్‌పేట-మూసారాంబాగ్ మధ్య మూసీ నదిపై నిర్మించిన హైలెవల్ బ్రిడ్జిని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజాపాలన ఏర్పడి 1,000 రోజులు పూర్తయ్యాయని, ఈ వెయ్యి రోజుల్లో అనేక సంస్కరణలు అమలు చేస్తూ విధ్వంసమైన తెలంగాణ రాష్ట్రాన్ని వికాసం వైపు తీసుకువెళ్లే ప్రయత్నం చేస్తుంటే తమ ప్రభుత్వం విఫలమైందని కొందరు విమర్శిస్తున్నారని తెలిపారు. వెయ్యి రోజుల ప్రజాపాలన మీద బురద జల్లేందుకు కొన్ని అల్లరి మూకలు బయల్దేరాయని మండిపడ్డారు. తెలంగాణను ధనిక రాష్ట్రంగా కేసీఆర్‌కు అప్పగిస్తే అప్పుల కుప్పగా మార్చారని, పదేళ్లలో రూ.8 లక్షల కోట్ల అప్పు చేశారని గుర్తు చేశారు.

**ఆ భారం అంతా నా నెత్తిన పడింది..**

కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుకు ఐదో తేదీన జీతాలు ఇస్తున్నామన్నారు. ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు 58 నుంచి 61 ఏళ్లకు బీఆర్ఎస్ పెంచిందని అలా 2024 నుంచి రిటైర్మెంట్ అవుతున్న వారి భారం అంతా నా నెత్తిన పడుతోందన్నారు. నెలకు 1000 మంది ప్రభుత్వ ఉద్యోగస్తులు రిటైర్మెంట్ అవుతున్నారని ఒక్కో ఉద్యోగి రిటైర్మెంట్ అయితే రూ.కోటి నుంచి రూ.50 లక్షలు ఇవ్వాల్సి వస్తుందని. ఇక పాత బకాయిలు రూ.8 వేల కోట్లు నా నెత్తిమీద పెట్టి కేసీఆర్ వెళ్లారన్నారు. రిటైర్మెంట్ ఉద్యోగుల బకాయిల కోసం మిగతా అన్నింటిని ఆపి వందరోజుల్లో రూ.6 వందల కోట్లు మా ప్రభుత్వం ఇవ్వలేదా? పీఆర్సీ ఇవ్వకుండా కేసీఆర్ బకాయిలు పెడితే మేము ఇవలేదా? ఉద్యోగ సంఘాలను పది సార్లు పిలిచి వారి ఆరోగ్య భద్రత కార్డులు పునరుద్ధరించలేదా? నాడు ఆర్టీసీ కార్మికులు చనిపోతే కేసీఆర్ కనీసం కన్నీటి చుక్క కార్చలేదన్నారు. నాడు ఆర్టీసీ గౌరవ అధ్యక్షుడిగా ఉన్న హరీశ్ రావు పారిపోలేదా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశాక రాష్ట్ర ఆర్థిక పరిస్థితి చూసి ఆశ్చర్యపోయానన్నారు

**మీరా నన్ను విమర్శించేది?**

మహిళలకు ఇచ్చిన బతుకమ్మ చీరల్లో కమిషన్లు తీసుకున్న బీఆర్ఎస్ నేతల బతుకు ఓ బతుకేనా అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. మీరా నా వెయ్యి రోజుల పరిపాలన గురించి ప్రశ్నించేదని నిలదీశారు. అంబర్‌పేట బతుకమ్మ కుంటను చెరబట్టిందెవరో.. కబ్జా పెట్టిందెవరో తెలియదా అని ప్రశ్నించారు. ఆక్రమణలు తొలగించి బతుకమ్మకుంటను మళ్లీ ఆడబిడ్డలను బహుమతిగా ఇచ్చామన్నారు. బతుకమ్మ కుట్రను మళ్లీ చెరబట్టేందుకు సుధాకర్ రెడ్డి అనే వ్యక్తి కుట్రలు చేస్తున్నారు. ప్రజల ఆస్తులు కాపాడుతున్నది ఎవరు.. కబ్జా చేస్తున్నది ఎవరు అని ప్రశ్నించారు. హైదరాబాద్ నగరం వేగంగా విస్తరిసతోందని ఈ నగరం ఇప్పుడు విశ్వనగరంగా మారిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అయితే నగరం పెరుగుతున్నంత వేగంగా మౌలిక వసతులు పెరగడం లేదని, అందుకే క్యూర్.. ప్యూర్.. రేర్ విధానాన్ని తీసుకువచ్చి మన రాష్ట్రం ప్రపంచంతో పోటీ పడేలా ప్రయత్నిస్తున్నామన్నారు. మూసీ వరదల్లో కొట్టుకుపోయినా ఏ ప్రభుత్వం సహాయం చేయలేదని పదేళ్లు అధికారంలో ఉన్న వాళు ఎందుకు మూసారాంబాగ్ వంతనె నిర్మించలేదని సీఎం ప్రశ్నించారు. గత సర్కార్ అంబర్ పేటలో ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కట్టలేదన్నారు. మేము వచ్చాక ప్రణాళికబద్ధంగా తెలంగాణ, హైదరాబాద్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. పదేళ్ల పాటు గ్రూప్-1,2, 3,4 వంటి ఉద్యోగాలు భర్తీ చేయలేదు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం గ్రూప్-1,2,3,4, డీఎస్సీ నిర్వహించింది. మొత్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం 72 వేల ఉద్యోగాలు భర్తీ చేసింది. మహిళల కోసం ఉచిత బస్ పథకం తెస్తే ఆటో డ్రైవర్లను ఉసిగొల్పారని దుయ్యబట్టారు.

**మున్సిపల్ కార్పొరేషన్లకు కొత్త లోగోలు**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం మూసారాంబాగ్‌లో పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మూడు కీలక మున్సిపల్ కార్పొరేషన్లకు చెందిన నూతన లోగోలను సీఎం అధికారికంగా ఆవిష్కరించారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పాలనా సౌలభ్యం కోసం ప్రభుత్వం ఇటీవల జీహెచ్ఎంసీ నుంచి రెండు కొత్త కార్పొరేషన్లను వేరు చేసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా జీహెచ్ఎంసీతో పాటు కొత్తగా ఏర్పాటు చేసిన మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ , సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నూతన లోగోలను సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. సుదీర్ఘమైన పదేళ్ల కాలం తర్వాత జీహెచ్ఎంసీకి రూపుదిద్దిన కొత్త లోగో నగరవాసుల దృష్టిని ఆకర్షిస్తోంది. నగర విస్తరణకు అనుగుణంగా పాలనను ప్రజలకు మరింత చేరువ చేయడానికే ఈ కార్పొరేషన్ల విభజన, నూతన గుర్తింపులను తీసుకువచ్చినట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**కేసీఆర్ అప్పులపై రేవంత్ ఫైర్.. 'భారం మోసున్నాం'!**

తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ పాలనపై సీఎం రేవంత్ రెడ్డి మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. గతంలో 16 మంది ముఖ్యమంత్రులు కలిసి 60 ఏళ్లకు పైగా పాలించినా రాష్ట్ర అప్పులు రూ.70 వేల కోట్లుగా ఉండేవని, కేసీఆర్ మాత్రం తొమ్మిదేళ్ల పాలనలో అప్పులను భారీగా పెంచారని ఆరోపించారు. రూ.70 వేల కోట్ల అప్పును రూ.8.11 లక్షల కోట్లకు తీసుకెళ్లారని విమర్శించారు. ప్రస్తుతం ఆ అప్పులకు సంబంధించిన అసలు, వడ్డీ చెల్లింపుల కోసం ప్రతి నెలా భారీ మొత్తాన్ని కేటాయించాల్సి వస్తోందని అన్నారు.

**ఏటా రూ.90 వేల కోట్లు చెల్లిస్తున్నాం**

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో చేసిన అప్పుల కారణంగా ఏడాదికి సుమారు రూ.90 వేల కోట్లు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రం ఇలాంటి ఆర్థిక పరిస్థితుల్లో ఉన్న సమయంలోనే డిసెంబర్ 7న ప్రభుత్వం తమ చేతుల్లోకి వచ్చిందని తెలిపారు. గత ప్రభుత్వం తమపై భారీగా ఆర్థిక భారాన్ని మోపి వెళ్లిందని విమర్శించారు.

**గంట కూడా పని చేయకుండా కోటి 24 లక్షల జీతమా? కేసీఆర్ రాజీనామా చేయాలి: సీఎం రేవంత్**

తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రజాపాలనకు వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా కేసీఆర్‌కు నేరుగా సవాల్ విసిరారు. వెయ్యి రోజుల్లో గంట కూడా ప్రజల కోసం పని చేయని కేసీఆర్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు

ఈ వెయ్యి రోజుల్లో ఒక్క రోజు కూడా బయటకు రాని కేసీఆర్.. ఎలాంటి విధులకు హాజరుకాకుండానే కోటి 24 లక్షల జీతం తీసుకున్నారని రేవంత్ ఎద్దేవా చేశారు. కేసీఆర్‌ను కాపాడటానికి సెక్యూరిటీ, బుల్లెట్ ప్రూఫ్ వాహనాల కోసం కలిపి ప్రభుత్వం ఈ వెయ్యి రోజుల్లో 22 కోట్ల రూపాయల ఖర్చు పెట్టిందని, ఏ ప్రభుత్వ ఉద్యోగైనా పని చేయకపోతే తీసేస్తారని ఆయన గుర్తుచేశారు. సెప్టెంబర్ 6 వరకు కేసీఆర్ రాజీనామా డిమాండ్ చేస్తూ మండల కేంద్రాల్లో బైక్ ర్యాలీలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కేసీఆర్‌కు నిజంగా దమ్ము, ధైర్యం ఉంటే అసెంబ్లీకి రావాలని.. పదేళ్ల ఆయన పాలనపై, తన వెయ్యి రోజుల పాలనపై బహిరంగ చర్చకు సిద్ధమని సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు.

# మోడీతో ఇరాన్ అధ్యక్షుడు భేటీ..

**న్యూ ఢిల్లీ :** ప్రధాని మోడీ కిర్గిజిస్థాన్‌లో పర్యటిస్తున్నారు. రాజధాని బిష్కెక్‌లో ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌తో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. షాంఘై సహకార సంస్థ సదస్సు సందర్భంగా ఇరువురు నేతలు భేటీ అయ్యారు. ఫిబ్రవరిలో ఇరాన్‌లో యుద్ధం ప్రారంభమైన తర్వాత మోడీ, పెజెష్కియాన్ ప్రత్యక్షంగా సమావేశం కావడం ఇదే తొలిసారి. ఈ సమావేశంలో భారత్-ఇరాన్ ద్వైపాక్షిక సంబంధాల తాజా పరిస్థితిని ఇరువురు నేతలు సమీక్షించారు. పరస్పర ప్రయోజనం ఉన్న రంగాల్లో ఉమ్మడి సహకారాన్ని మరింత బలోపేతం చేసి, విస్తరించాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పినట్లు ఇరాన్‌కు చెందిన సెమీ-అఫీషియల్ వార్తా సంస్థ తస్నీమ్ వెల్లడించింది. ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాఘ్చితో పాటు పలువురు ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

**ఉద్రిక్త పరిస్థితుల వేళ..**

అమెరికా-ఇరాన్ మధ్య కొనసాగుతున్న యుద్ధం నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. పశ్చిమాసియాలో భౌగోళిక రాజకీయ పరిస్థితులు తీవ్ర ఉద్రిక్తంగా ఉన్న సమయంలో ఇరువురు నేతలు సమావేశమయ్యారు. ఇరాన్‌కు భారత్ టాప్-10 వాణిజ్య భాగస్వాముల్లో ఒకటిగా ఉంది. అయితే హార్ముజ్ జలసంధి మూసివేత, ఇరాన్‌పై అమెరికా ఆంక్షల కారణంగా ఇరు దేశాల మధ్య ఆర్థిక కార్యకలాపాలపై ప్రభావం పడుతోంది. అంతకుముందు మార్చి 21న మోడీ, పెజెష్కియాన్ ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఆ సమయంలో పశ్చిమాసియాలో భద్రతా పరిస్థితిపై విస్తృతంగా చర్చించారు. జూన్‌లోనూ ఇరువురు నేతలు ఫోన్‌లో సంభాషించారు. ఈ సందర్భంగా మధ్యప్రాచ్య పరిణామాలపై పెజెష్కియాన్ మోడీకి వివరించారు. ఘర్షణను ముగించేందుకు కుదిరిన అవగాహనను మోడీ స్వాగతించడంతో పాటు శాశ్వత శాంతి, స్థిరత్వం కోసం నిరంతర ప్రయత్నాలు అవసరమని స్పష్టం చేశారు.

**అర్మేనియా ప్రధాని పాషిన్యాన్‌తోనూ మోడీ భేటీ**

ఎస్‌సీవో సదస్సు సందర్భంగా మోడీ అర్మేనియా ప్రధాని నికోల్ పాషిన్యాన్‌తోనూ సమావేశమయ్యారు. రక్షణ, ఆర్థిక, ఫార్మాస్యూటికల్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ, సంస్కృతి, విద్య తదితర రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేసే మార్గాలపై ఇరువురు చర్చించారు. పశ్చిమాసియా పరిస్థితితో పాటు ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపైనా అభిప్రాయాలు పంచుకున్నారు. భారత్-అర్మేనియా సంబంధాలను మరింత లోతుగా, విస్తృతంగా తీసుకెళ్లేందుకు అర్మేనియాతో కలిసి పనిచేయాలని భారత్ ఎదురుచూస్తోందని మోడీ తెలిపారు.

**పుతిన్‌తోనూ మోడీ భేటీ?**

ఇదిలా ఉండగా.. మోడీ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తోనూ సమావేశం కానున్నట్లు తెలుస్తోంది. అనంతరం కిర్గిజిస్థాన్ అధ్యక్షుడు సదీర్ జపరోవ్ ఆహ్వానం మేరకు 6వ వరల్డ్ నోమాడ్ గేమ్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రధాని పాల్గొననున్నారు.

# రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ కక్షపూరిత కుట్ర మహేష్ కుమార్ గౌడ్




**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** దళితులపై జరుగుతున్న వివక్ష, అంటరానితనం, సామాజిక అన్యాయాలకు వ్యతిరేకంగా గళం వినిపించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం బీజేపీ కక్షపూరిత రాజకీయ కుట్రకు నిదర్శనమని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ఎదుర్కొన్న అవమానకర పరిస్థితులపై రాహుల్ గాంధీ ప్రశ్నిస్తే.. సమస్యను పరిష్కరించాల్సిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా ప్రశ్నించిన రాహుల్ గాంధీపైనే కేసులు నమోదు చేయడం దురదృష్టకరమని అన్నారు. దళితులపై వివక్ష, అంటరానితనాన్ని ప్రశ్నించడం నేరమా అని ఆయన ప్రశ్నించారు. అన్యాయాన్ని ప్రశ్నించే గొంతులను అణచివేయడం ద్వారా అంటరానితనం, కుల వివక్షను నిర్మూలించలేరని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

**రాజ్యాంగ గ్యాంగ స్ఫూర్తికే విరుద్ధం:**

బాధితుల పక్షాన నిలబడాల్సిన ప్రభుత్వం.. అన్యాయాన్ని ప్రశ్నించిన వారినే నిందితులుగా చిత్రీకరించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. అంటరానితనాన్ని రాజ్యాంగం ద్వారా నిర్మూలించడం నుంచి ఎస్సీ, ఎస్టీలపై అఘాయిత్యాలను నిరోధించేందుకు ప్రత్యేక చట్టాల రూపకల్పన వరకు సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ పార్టీ చారిత్రకంగా పోరాడిందని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. దళితులపై వివక్షను నిర్మూలించేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇప్పటివరకు తీసుకున్న నిర్దిష్ట చర్యలేమిటో దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అంటరానితనం నిర్మూలన కోసం ఆర్ఎస్ఎస్ చేపట్టిన ఉద్యమాలు, చేసిన పోరాటాలేమిటో కూడా ప్రజలకు వివరించాలని సవాల్ చేశారు. అంబేద్కర్ ఆశయాలైన సమానత్వం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. దళితుల హక్కులు, ఆత్మగౌరవం కోసం కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. కుల వివక్ష, అంటరానితనం, సామాజిక అన్యాయానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పోరాటం నిరంతరం కొనసాగుతుందని తెలిపారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తాం



**షాద్‌నగర్,ఫ్లాష్ ఇండియా :** ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారాన్ని నమ్మవద్దని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం సహాయనిధి పథకాలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగవని స్పష్టం చేశారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం నియోజకవర్గంలోని 150 మంది లబ్ధిదారులకు రూ.50 లక్షల విలువైన సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే శంకర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదలను ఆదుకునేందుకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పథకాల అమలులో జరిగిన లోపాలను సరిదిద్దుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రజలు అనవసరమైన ఆందోళనలకు గురికావద్దని, అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూరి బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్, కౌన్సిలర్లు మురళీమోహన్, ప్రవీణ్, జమ్రుద్ ఖాన్, దంగు శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి 7730032999 flashindiadaily@gmail.com

## రేవంత్ పాలనలో మంత్రులకు స్వేచ్ఛ లేదు



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనా తీరుపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి కేబినెట్‌లోని మంత్రులకు పూర్తిస్థాయి స్వేచ్ఛ లేదని, వారి శాఖలపై మంత్రులకే అధికారం, పూర్తి హక్కులు కల్పించాలని ఆయన స్పష్టం చేశారు. మంత్రులకు తగిన స్వేచ్ఛ ఇవ్వకపోతే రానున్న రోజుల్లో లేని సమస్యలు తెరపైకి వచ్చి ప్రభుత్వానికి ఇబ్బందులు ఎదురవుతాయని హెచ్చరించారు. అదే సమయంలో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సుశ్మిత చేసిన వ్యాఖ్యలను కూనంనేని తప్పుపట్టారు. రాజకీయంలో విధానపరమైన విమర్శలు ఉండాలి తప్ప, సీఎంపై వ్యక్తిగత విమర్శలు చేయడం ఎంతమాత్రం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. మరోవైపు రాష్ట్రంలో భూ సమస్యలు, ప్రభుత్వ అలసత్వంపై కూడా ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. సుమారు కోటి ఎకరాల భూములను నిషేధిత జాబితాలో పెట్టడం వల్ల ప్రజలు, రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం తీవ్ర అలసత్వంతో వ్యవహరిస్తోందని, సమస్యల తీవ్రతను గుర్తించి వెంటనే పరిష్కారం చూపడంలో విఫలమవుతోందని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి నిషేధిత జాబితా భూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కూనంనేని సాంబశివ రావు డిమాండ్ చేశారు.

# 2027 ఏప్రిల్ నాటికి గద్వాల రైల్వే అభివృద్ధి...

**జోగులాంబ,ఫ్లాష్ ఇండియా :** దేశవ్యాప్తంగా రైల్వే రంగంలో అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని కేంద్ర గనులు, బొగ్గు మరియు టూరిజం శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో ఒకేసారి 42 రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. సోమవారం గద్వాల రైల్వే స్టేషన్‌ను పరిశీలించిన అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత 12 ఏళ్లలో రైల్వే రంగంలో గణనీయమైన ప్రగతి సాధించామని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే అభివృద్ధికి ఏడాదికి సుమారు రూ.886 కోట్ల నిధులు ఖర్చు చేయగా, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం 2025-26లోనే రూ.5,454 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. గత ప్రభుత్వాల హయాంలో 2009 నుంచి 2014 వరకు సంవత్సరానికి సగటున 87 కిలోమీటర్ల మేర కొత్త రైల్వే లైన్లు వేయగా, మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి ఏడాది సగటున 888 కిలోమీటర్ల మేర రైల్వే లైన్ల నిర్మాణం జరుగుతోందన్నారు. తెలంగాణలో రైల్వే క్రాసింగ్‌ల వద్ద ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసం 520 ఆర్ఓబీలు, ఆర్‌యూబీల నిర్మాణాలను చేపడుతున్నామని తెలిపారు.



### తెలంగాణకు 100 కొత్త రైళ్లు..

గత పదేళ్లలో తెలంగాణ రాష్ట్రానికి 100 కొత్త రైళ్లను మంజూరు చేసినట్లు కిషన్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని రైల్వే లైన్ల విద్యుదీకరణ పనులను పూర్తి చేశామని చెప్పారు. ప్రయాణికుల సౌకర్యార్థం తెలంగాణలోని 174 రైల్వే స్టేషన్లలో హైస్పీడ్ ఉచిత వైఫై సదుపాయం కల్పించినట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా మంజూరైన 7 వందేభారత్ రైళ్లలో మూడు రైళ్లను తెలంగాణకు కేటాయించినట్లు తెలిపారు. కాజీపేటలో నూతన జనరేషన్‌కు అనుగుణంగా ఆధునిక రైళ్ల తయారీకి సంబంధించిన ఏర్పాట్లు రైల్వే శాఖ చేపట్టబోతోందన్నారు. రైల్వే ప్రమాదాల నివారణకు 'కవచ్' సాంకేతికతను తెలంగాణలో పైలట్ ప్రాజెక్టుగా వినియోగిస్తున్నట్లు తెలిపారు.

**గద్వాలకు రూ.66 కోట్లతో మరో ఆర్ఓబీ..**

గద్వాల పట్టణానికి మరో కీలక రైల్వే సదుపాయం రానుందని కిషన్‌రెడ్డి వెల్లడించారు. బీరెల్లి రోడ్డు మార్గంలో సుమారు రూ.66 కోట్లతో మరో రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ) నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. గద్వాల రైల్వే స్టేషన్‌లో ప్రతిరోజూ సుమారు 7 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారని, ప్రస్తుతం 34 రైళ్లకు గద్వాల స్టేషన్‌లో హాల్ట్ కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అమృత్ భారత్ పథకంలో భాగంగా గద్వాల రైల్వే స్టేషన్‌ను ఆధునికంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. స్టేషన్‌లో మూడు ఎస్కలేటర్లు, మూడు లిఫ్టులు ఏర్పాటు చేయడంతో పాటు రెండు ప్లాట్‌ఫారాలను ఆధునికీకరించనున్నట్లు చెప్పారు. గద్వాల రైల్వే స్టేషన్‌కు వందేళ్లు పూర్తికానున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కిషన్‌రెడ్డి తెలిపారు. గద్వాల రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను 2027 ఏప్రిల్ నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు.

**అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి..**

అంతకుముందు కిషన్‌రెడ్డి గద్వాల రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను స్వయంగా పరిశీలించారు. పనుల పురోగతి, ప్రయాణికులకు కల్పిస్తున్న సౌకర్యాలు, భవిష్యత్‌లో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ, రైల్వే డీఆర్ఎం సంతోష్‌కుమార్, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా, రైల్వే అధికారులు,అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, భరత్‌కుమార్, స్నిగ్ధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మజ్లిస్‌లో ధిక్కార స్వరం..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రహ్మత్ బేగ్ వ్యవహారం మజ్లిస్ పార్టీకి తలనొప్పిలా మారింది. ఓ బాలికను లైంగికంగా వేధించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న రహ్మత్ బేగ్‌ను ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని మజ్లిస్ అధిష్ఠానం ఆదేశించింది. కానీ, మూడు రోజులైనా ఆయన రాజీనామా చేయలేదు. పైగా.. తాను ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీనామా చేయబోనంటూ ధిక్కార స్వరం వినిపించడం పార్టీ శ్రేణుల్లో కలకలం రేపుతోంది.మజ్లిస్ ఎమ్మెల్సీ రహ్మత్ బేగ్.. ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు ఇటీవల ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో పార్టీ ఆయనపై సస్పెన్షన్ వేటు వేసింది. దాంతోపాటు ఎమ్మెల్సీ పదవికి కూడా రాజీనామా చేయాలని ఆదేశించింది. అయితే పరారీలో ఉన్న రహ్మత్ బేగ్ కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు.

**స్పందించిన ఎమ్మెల్సీ..**

మజ్లిస్ ఎమ్మెల్సీ రహ్మత్ బేగ్ తనపై వచ్చిన లైంగిక ఆరోపణలపై ఎట్టకేలకు స్పందించారు. 'నేను ఏ తప్పూ చేయలేదు. ఉద్దేశపూర్వకంగానే నాపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు' అని రహ్మత్ బేగ్ అన్నారు. ఫేక్ వీడియోలను సృష్టించి తనపై లేనిపోని అభాండాలు వేస్తున్నారన్నారు. ఈ విషయమై ఈ నెల 26న పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఆయన తెలిపారు.

# ఏపీకి కృష్ణాజలాల తరలింపేంటి?

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కృష్ణాజలాల దోపిడీపై సీఎం రేవంత్ రెడ్డి మౌనంగా చోద్యం చూస్తూ ఉండటం.. తెలంగాణకు తీరని ద్రోహం చేయడమేనని మాజీ మంత్రి హరీశ్ రావు ధ్వజమెత్తారు. నీళ్లు లేక తెలంగాణ ఆయకట్టు ఎండుతుంటే.. ఏపీ మాత్రం ఇక్కడి కృష్ణాజలాలను దోచుకుంటోందని ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ అడ్డగోలుగా కృష్ణా జలాలను తరలిస్తున్నా సీఎం రేవంత్ రెడ్డి మౌనం వహిస్తున్నారని, మన ప్రాజెక్టులు ఎండిపోతుంటే.. బేసిన్ దాటి ఏపీకి నీళ్ల తరలింపు చేపట్టడం ఏంటని ప్రశ్నించారు. పాలమూరు, నల్లగొండ, రంగారెడ్డి రైతాంగానికి కాంగ్రెస్ సర్కార్ తీరని ద్రోహం చేస్తోందన్నారు. ఇంత జరుగుతుంటే కృష్ణా రివర్ మేనేజ్మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ) ప్రేక్షకపాత్ర వహిస్తోందన్నారు.ఒకవైపు ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో సాగునీటి కష్టాలు తీవ్రమవుతుంటే.. మరోవైపు ఏపీ ప్రభుత్వం తెలంగాణ నీటి హక్కులపై దండెత్తి కృష్ణా జలాలను అడ్డగోలుగా తరలిస్తోందని హరీష్ రావు ఆరోపించారు. కృష్ణా బేసిన్‌లో భాగమైన బీమా, కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులకు నీళ్లు లేక ఆయకట్టులు ఎండిపోతుంటే.. మరోవైపు బేసిన్‌తో సంబంధం లేని ప్రాంతాలకు ఏపీ నిబంధనలు ఉల్లంఘిస్తూ, యథేచ్ఛగా నీటిని తరలిస్తోందన్నారు. మాల్యాల, ముచ్చుమర్రి, పోతిరెడ్డిపాడు, నాగార్జున సాగర్ కుడి కాల్వ.. ఇప్పుడు వెలిగొండ.. ఇలా అన్నిరకాలుగా తెలంగాణ వాటా నీటిని ఏపీ తరలిస్తున్నా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎందుకు నోరు మెదపడం లేదు? అని నిలదీశారు.రంగారెడ్డి, పాలమూరు, నల్లగొండ సహా తెలంగాణ రైతాంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం తీరని ద్రోహం చేస్తోందన్నారు. తెలంగాణకు దక్కాల్సిన కృష్ణా నీళ్లను మన పొలాలకు మళ్లించాల్సిన సీఎం రేవంత్ రెడ్డి.. ఏపీకి పరోక్షంగా ఎందుకు సహకరిస్తున్నారు? ప్రాజెక్టుల నిర్వహణ, నీటి వినియోగాన్ని పర్యవేక్షించాల్సిన కేఆర్ఎంబీ సైతం పట్టనట్లు వ్యవహరించడం దుర్మార్గమన్నారు. తెలంగాణ ప్రయోజనాలను కాపాడాల్సిన సంస్థే ప్రేక్షకపాత్ర పోషిస్తే.. రాష్ట్ర నీటి హక్కులను ఎవరు కాపాడాలి? కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెంటనే దీనిపై స్పందించాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. కేఆర్ఎంబీ పై ఒత్తిడి తెచ్చి, తెలంగాణలోని కృష్ణా బేసిన్ ప్రాజెక్టులను నింపి, ఆయకట్టుకు నీటి సరఫరా జరిగేలా చూడాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామని ట్వీట్ లో పేర్కొన్నారు.



## నియోజకవర్గ అభివృద్ధికి కృషి..

**మిరుదొడ్డి,ఫ్లాష్ ఇండియా :** నియోజకవర్గ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం సిద్దిపేట జిల్లా అక్బర్పేట్ భూంపల్లి మండలం రామేశ్వరంపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు నిర్మించిన నూతన ప్రహరీ గొడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించడం జరుగుతున్నారు. అనంతరం మండలంలో భూంపల్లి గ్రామంలో మహిళా సమాఖ్య ఆవరణలో మహిళల కోసం ప్రత్యేకంగా నిర్మించిన మహిళా భవనాన్ని ప్రారంభించారు. మహిళా సంఘాల కార్యకలాపాలకు, సమావేశాలకు ఈ భవనం ఎంతగానో ఉపయోగపడుతుందని వారు తెలిపారు. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా నూతనంగా మంజూరైన ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, మండల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు, ప్రతినిధులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాగా దుబ్బాక నియోజకవర్గంలో ఎలాంటి కార్యక్రమాలు జరిగినా పోలీసుల బందోబస్తు మధ్య జరిగేవి, ఇరు పార్టీల కార్యకర్తల మధ్య వాగ్వాదాలు జరిగిన సంఘటలు ఉన్నాయి, అందుకు భిన్నంగా ఈ రోజు కార్యక్రమంలో ఎలాంటి అవంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో జరగడం గమనర్హం.

# మార్పు దిశగా తెలంగాణ రాజకీయం..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాబోయే రోజుల్లో తెలంగాణ రాజకీయాలు స్పష్టమైన మార్పు దిశగా పయనిస్తాయని, రాబోయే రోజుల్లో రాజకీయాల్లో మార్పులు తీసుకువచ్చి పేదవారికి సేవ చేయాలని భావిస్తున్నానన్నట్లు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. అవసరం అయితే నిజాయితీపరులైన వారిని అసెంబ్లీలో అడుగుపెట్టేలా చేస్తానన్నారు. ఈ మార్పులో నా పాత్ర కీలకంగా ఉండబోతోందని డబ్బుల కోసం రాజకీయం చెయ్యడానికి వచ్చిన వాళ్ళు శాశ్వతంగా ఉండలేరని డబ్బులే కావాలనుకునే వారు వ్యాపారం చేసుకోవాలన్నారు. వ్యవస్థ మొత్తం అవినీతి మయం అయ్యాయిందని అధికారులు, రాజకీయ నాయకులు అవినీతికి పాల్పడుతుంటే పేదలకు న్యాయం ఎలా లభిస్తుందని ప్రశ్నించారు. అవినీతి గ్రామీణ ప్రాంతం వరకు పాకిందనన్నారు. వైఎస్ఆర్‌సీపీ పార్టీ ఎన్ఆర్ఐ టీమ్ ఏర్పాటు చేసిన ట్విట్టర్ స్పేస్ లో మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి హాజరై సంచలన వ్యాఖ్యలు చేశారు.

**అందుకే ప్రతి విషయాన్ని మాట్లాడుతున్నా..**

తనకు మంత్రి పదవి ముఖ్యం కాదని రాజకీయ నాయకుల ఆలోచన విధానం, వ్యవస్థ మారాలన్నారు. మార్పు దిశగా అడుగులు వేస్తున్నానని అందుకే గత కొన్ని నెలలుగా నేను ప్రతి విషయాన్ని మాట్లాడుతున్నానన్నారు. పదవుల కంటే రాజకీయ నాయకుల ఆలోచనా విధానం, వ్యవస్థలో మార్పు రావడమే ముఖ్యమని పేర్కొన్నారు. ప్రభుత్వం ఒక చేత్తో రైతు బంధు లాంటి పథకాల ద్వారా డబ్బులు ఇస్తూ, మరో చేత్తో బెల్ట్ షాపుల ద్వారా ఆ సొమ్మును గుంజుకోవడం సరికాదని కోమటిరెడ్డి అన్నారు. మునుగోడు నియోజకవర్గంలో బెల్ట్ షాపులను పూర్తిగా ఎత్తివేయించగలిగానని, ప్రజలకు నష్టం కలిగించే చర్యలను ప్రభుత్వం ఇప్పటికైనా నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

**ఆయన ఆశీర్వాదం వల్లే:**

వైఎస్ రాజశేఖర్ రెడ్డి అంటే తనకు చాలా అభిమానం అని ఆయన ఎప్పటికీ నా గుండెల్లో ఉంటారన్నారు. పేద ప్రజల కోసం ఆయన తీసుకువచ్చిన కార్యక్రమాలు ఎప్పటికీ మర్చిపోలేం. ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్, ఫీజు రీయింబర్స్ మెంట్ వంటి కార్యక్రమాలు చేశారు. వైఎస్సార్ ఒక రాజకీయ నాయకుడిగా కాకుండా ఒక కుటుంబ సభ్యుడిగా నిలిచారు. కాంగ్రెస్ పార్టీలో ఆయన లాంటి మరొక లీడర్ లేనే లేడన్నారు. తెలంగాణ ఏర్పడినా ఆయన అంటే మాకు ఎనలేని అభిమానం ఉందని తెలంగాణ ఉద్యమం పీక్స్ లో ఉన్న సమయంలో మా గ్రామంలో రాజశేఖర్ రెడ్డి విగ్రహం ఏర్పాటు చేశామమని తెలిపారు. కోమటిరెడ్డి బ్రదర్స్ అంటే రాజశేఖర్ రెడ్డి టీమ్ అని అంటారని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఇవాళ ఈ స్థాయిలో ఉన్నారంటే అది వైఎస్సార్ ఆశీర్వాదమేనన్నారు. రాజశేఖర్ రెడ్డి ఇన్ఫిరేషన్ తోనే నేను రాజకీయాల్లోకి వచ్చాను.

**బకాయిలు చెల్లించలేని పరిస్థితిలో ప్రభుత్వం..**

ఫీజు రీయింబర్స్ మెంట్ రాను రాను మిస్ యూజ్ అవుతోందని కోమటిరెడ్డి అన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్ కోసమే ఇంజనీరింగ్ కాలేజీలు పుట్టగొడుగుల్లా పుట్టుకు వచ్చాయని సరైన మౌళిక వసతులు లేకుండానే ఇంజినీరింగ్ కాలేజీలు వచ్చాయన్నారు. ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం సమయానికి ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు ఇవ్వకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వమేమో అప్పుల్లో ఉంది. ఫీ రియంబర్స్మెంట్ బకాయిలు చెల్లించలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉంది. సరైన రీతిలో మానిటరింగ్ ఉంటే ఇది చాలా మంచి పథకం అన్నారు. ఫీజు రీయింబర్స్ ఖర్చు అని అనుకోవద్దు. ఇది మన యువతపై పెడుతున్న ఇన్వెస్ట్ మెంట్ అనుకోవాలి.

# నేను పిరికిదాన్ని కాదు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** బీఆర్ఎస్ పార్టీ నుంచి తనను సస్పెండ్ చేయడంపై టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత భావోద్వేగానికి గురయ్యారు. పార్టీ కోసం తనను జైలుకు పంపారని పెద్ద పెద్ద నాయకులే చెప్పారని, ఆ తర్వాత పార్టీలో నుంచే తనను బయటకు పంపారని, ఎందుకు ఇలా చేయాలంటూ కన్నీటి పర్యంతమయ్యారు. నిజామాబాద్ లో నిర్వహించిన టీఆర్ఎస్ పాంచజన్య సభలో ఆమె మాట్లాడుతూ.. బీఆర్ఎస్ తీరును ఎండగట్టారు. సొంతగా పార్టీ పెట్టిన తర్వాత తొలిసారి నిజామాబాద్ గడ్డకు వచ్చిన కవిత.. కన్నీటి పర్యంతమైనంత మాత్రాన తాను పిరికిదాన్ని కానన్నారు. ఎంతో బాధ, ఆవేశంతో వచ్చిన కన్నీరన్నారు. దీంతో ఆ ప్రాంగణమంతా.. కవిత సీఎం.. సీఎం.. అనే నినాదాలతో కార్యకర్తలు హోరెత్తించారు. కవిత బోరున విలపించడంతో.. అక్కడున్న మహిళలు సైతం కంటతడి పెట్టుకున్నారు.తెలంగాణలో ఇంకా చేసుకోవాల్సిన మంచిపనులెన్నో ఉన్నాయని, అందుకే పార్టీ పెట్టానన్నారు. తనను పుట్టింటి నుంచి బయటకు పంపితే.. తన అత్త, మామలు ఒక్కమాట కూడా అనకుండా కడుపులో పెట్టుకుని, కన్నబిడ్డలా చూసుకున్నారన్నారు. ఆర్నెల్లు జైలుకెళ్లి వచ్చిన తనను ఆదరించాల్సిన పుట్టినిల్లు బయటకు పంపేసిందని మరోసారి కన్నీరు పెట్టుకున్నారు. ఏ తప్పూ చేయని తనను తీహార్ జైలుకు పంపినవారికి.. ఎన్నికల్లో గెలుపుతో సమాధానం చెప్తానన్నారు. రాష్ట్రంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కొత్త రాజకీయ శక్తి అవసరమన్నారు. కాళేశ్వరంతో నిజామాబాద్ జిల్లాలో ఒక్క ఎకరానికైనా నీళ్లొచ్చాయా? అని నిలదీశారు. దొంగ హామీలతో గద్దెనెక్కిన వారిని నిలదీసేందుకు, పోరాడేందుకు బీఆర్ఎస్ ఎందుకు వెనక్కి తగ్గుతుందని ప్రశ్నించారు. తాను నిప్పులాంటి నిజామాబాద్ బిడ్డను అని, వచ్చే ఎన్నికల్లో తెలంగాణ రక్షణ సేన పార్టీ అభ్యర్థులను ఆదరించి.. విజయాన్ని అందించాలని కవిత కోరారు.రాష్ట్రంలో కొత్త నాయకత్వం రావలసిన అవసరం ఉందన్నారు కవిత. అందరికీ సామాజిక న్యాయం చేసేందుకు సంకల్పించానని, పదవుల కోసం కాకుండా ప్రజల కోసం, పాలనలో మార్పు కోసం తనకు అవకాశం ఇవ్వాలన్నారు. ఇప్పుడు ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు హామీల నుంచి తప్పించుకుని వెళ్తారని, లింబాద్రిగుట్టపై రుణమాఫీపై పెట్టిన ఒట్టును మరిచిపోయారన్నారు. ప్రతీ నియోజకవర్గానికి షాడో ఎమ్మెల్యేలను నియమించుకుని, కాంగ్రెస్ చేస్తున్న అవినీతినంతా బయటికి తీస్తామన్నారు. కొత్త వాళ్లతోనే కొత్త చరిత్ర రాద్దామని కవిత పిలుపునిచ్చారు.

**సంతోష్, హరీశ్‌లను క్షమిస్తా కానీ ప్రశాంత్ రెడ్డిని వదలను: కవిత**

టీఆర్ఎస్ (తెలంగాణ రక్షణ సేన) అధినేత్రి కల్వకుంట్ల కవిత నిజామాబాద్ నిర్వహించిన బహిరంగ సభలో తీవ్ర భావోద్వేగానికి లోనై కన్నీరు పెట్టుకున్నారు. బీఆర్ఎస్ మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి లక్ష్యంగా ఆమె తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. మహాభారతంలో శకుని ఎలాంటి పాత్ర పోషించాడో, ప్రశాంత్ రెడ్డి కూడా తెలంగాణ రాజకీయాల్లో అలాగే వ్యవహరించారని మండిపడ్డారు. తమ ఇంట్లోనే కూర్చొని అన్నం తిన్న ప్రశాంత్ రెడ్డి, తండ్రీకూతుళ్లయిన కేసీఆర్-తన మధ్య విబేధాలు సృష్టించి విడదీశారని ఆవేదన వ్యక్తం చేశారు. నన్ను నా తండ్రి నుంచి వేరు చేసిన పాపాత్ముడు ప్రశాంత్ రెడ్డి అని తీవ్రంగా విమర్శించారు. సంతోష్ రావు, హరీశ్ రావులను అయినా క్షమిస్తానేమో గానీ, ప్రశాంత్ రెడ్డిని మాత్రం ఎప్పటికీ క్షమించనని స్పష్టం చేశారు. ఆయనకు ఇక ప్రజాజీవితం లేదని, రాబోయే ఎన్నికల్లో ఎక్కడ పోటీ చేసినా వెంటపడి మరీ ఓడిస్తానని హెచ్చరించారు.అంతేకాకుండా, ప్రశాంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లేందుకు ప్రయత్నాలు చేశారని, గతంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తన రాజకీయ ఎదుగుదలను అణగదొక్కేందుకు కుట్రలు చేశారని ఆరోపించారు. రానున్న రోజుల్లో నిజామాబాద్ జిల్లాలోని 5 అసెంబ్లీ స్థానాలను గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేసిన కవిత, ప్రజల పక్షాన నిరంతరం పోరాటం చేస్తానని ప్రకటించారు.

# అలాగైతే కేబినెట్ నుంచి వైదొలుగుతాం..

**తమిళనాడు :** తమిళనాడులో సంకీర్ణ ప్రభుత్వంలో కొత్త తగాదాలు మొదలయ్యాయి. ఇటీవల ఓ మీడియా సంస్థ నిర్వహించిన సర్వేలో సీఎం విజయ్ ప్రధాని రేసులో మూడో స్థానంలో ఉన్నట్లు తేలింది. అప్పటి నుంచి టీవీకే ఆధ్వర్యంలో నేతలు విజయ్ జాతీయ నాయకుడిగా కీర్తిస్తున్నారు. ప్రధాని అభ్యర్థి అంటూ ప్రచారం చేస్తున్నారు. ఈ వ్యవహారం ఇప్పుడు కాంగ్రెస్‌కు ఆగ్రహాన్ని తెప్పించింది. టీవీకే ఇలాంటి ప్రచారం ఆపకపోతే కేబినెట్ నుంచి వైదొలుగుతామని హస్తం నేతలు హెచ్చరించారు. 2029లో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవుతారని.. దీనికి టీవీకే మద్దతు లభించకపోతే మంత్రివర్గం నుంచి తప్పుకుంటామని వార్నింగ్ ఇచ్చారు.తమిళనాడులో విజయ్ నాయకత్వంలో కొత్త ప్రభుత్వం ఏర్పడింది.



ఎంకే స్టాలిన్ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న కాంగ్రెస్ కూడా ఇందులో భాగమైంది. మొదటి టర్మ్‌లోనే విజయ్ ముఖ్యమంత్రి అయ్యారు. ఇప్పుడు ప్రధానమంత్రి పదవిపై ఆయనకున్న ఆశలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆయన ఎప్పుడూ బహిరంగంగా ఏమీ చెప్పనప్పటికీ.. తమిళనాడులో 'ప్రధానమంత్రిగా విజయ్' అనే ప్రచారం జరుగుతోంది. ఇది కాంగ్రెస్ పార్టీలో అశాంతికి కారణమైంది. ఈలోగా రాష్ట్ర ప్రభుత్వంలో కాంగ్రెస్ కోటాకు చెందిన పర్యాటక శాఖ మంత్రి రాజేష్ కుమార్ ఈ ప్రచారంపై ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమిలో ఉంటూనే టీవీకే ప్రధానమంత్రి పదవికి రాహుల్ గాంధీ అభ్యర్థిత్వానికి మద్దతు ఇవ్వకపోతే తాము విజయ్ మంత్రివర్గం నుంచి వైదొలుగుతామని అన్నారు. మరోవైపు డీఎంకే కూడా సీఎం విజయ్‌ను ఎద్దేవా చేస్తూ ఐరాస చీఫ్ అవుతారంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించింది.తమిళనాడులో కొత్తగా ఏర్పడిన విజయ్ ప్రభుత్వానికి కాంగ్రెస్‌తో పొత్తును కొనసాగించడం కీలకం. ఎందుకంటే రాష్ట్రంలో మెజారిటీ 118 సీట్లు కాగా.. టీవీకేకు సొంతంగా కేవలం 107 సీట్లు మాత్రమే ఉన్నాయి. అందువల్ల పొత్తులో ఎలాంటి ఉద్రిక్తతలు రాకుండా చూసుకోవడం ప్రస్తుతం అవసరం.

# సంపాదకీయం




# పీఓపీ విగ్రహాలతో పెరుగుతున్న ముప్పు

వినాయక చవితి అంటే భక్తి, ఉత్సాహం, సామూహిక సంబరాలకు ప్రతీక. అయితే పండుగ ముగిసిన తర్వాత జరిగే విగ్రహాల నిమజ్జనం పర్యావరణానికి పెద్ద సవాల్‌గా మారుతోంది. ముఖ్యంగా హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్, నగరంలోని చెరువుల్లో భారీ సంఖ్యలో విగ్రహాల నిమజ్జనం కారణంగా నీటి కాలుష్యం, జీవవైవిధ్యంపై ప్రతికూల ప్రభావం ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలోనే తెలంగాణ హైకోర్టు, జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ) ఏటా పలు ఆంక్షలు విధిస్తున్నాయి. అయితే ఆదేశాలు ఉండటం కంటే వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేయడమే ప్రధాన సమస్యగా మారుతోంది.

**పీఓపీ విగ్రహాలతో పెరుగుతున్న ముప్పు**

విగ్రహాల తయారీలో ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ), వివిధ లోహాలు, స్టీల్ వంటి పదార్థాల వినియోగం పర్యావరణానికి ప్రధాన సమస్యగా మారుతోంది. పీఓపీ నీటిలో సులభంగా కరగకపోవడంతో నిమజ్జనం అనంతరం విగ్రహాల అవశేషాలు చెరువులు, సరస్సుల్లో పేరుకుపోతాయి. ఫలితంగా నీటి నాణ్యత దెబ్బతినడంతో పాటు జలచరాల జీవనానికి ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉంటుంది. విగ్రహాలపై ఉపయోగించే పెయింట్లు, రంగుల్లోని రసాయనాలు నీటిలో కలిసే ప్రమాదం కూడా ఉంది. హుస్సేన్‌సాగర్ వంటి నగరంలోని కీలక జలవనరుల్లో ఇలాంటి కాలుష్యం పర్యావరణ ప్రభావాన్ని మరింత తీవ్రం చేస్తుంది. ఇప్పటికే పట్టణ మురుగునీరు, ఇతర కాలుష్య కారకాలతో ఒత్తిడిని ఎదుర్కొంటున్న సరస్సుపై భారీ స్థాయిలో నిమజ్జనాలు అదనపు భారాన్ని మోపుతున్నాయి.

**కోర్టుల ఆదేశాల ఉద్దేశం ఇదే**

పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని పీఓపీ విగ్రహాలను హుస్సేన్‌సాగర్‌లో నేరుగా నిమజ్జనం చేయకుండా ప్రత్యామ్నాయ కృత్రిమ నిమజ్జన కేంద్రాలను ఉపయోగించాలని కోర్టులు సూచిస్తున్నాయి. ట్యాంక్‌బండ్ నుంచి నేరుగా సరస్సులోకి విగ్రహాలను వదలకుండా నియంత్రించడం కూడా ఇదే ఉద్దేశంతో చేపడుతున్న చర్య. ఇక్కడ ప్రధానంగా గమనించాల్సిన విషయం ఏమిటంటే.. కోర్టులు పండుగ నిర్వహణను వ్యతిరేకించడం లేదు. పర్యావరణ పరిరక్షణకు నష్టం కలగకుండా నిమజ్జన ప్రక్రియను నిర్వహించాలన్నదే ఆదేశాల సారాంశం. అంటే సంప్రదాయాన్ని కొనసాగిస్తూనే పర్యావరణహిత మార్గాలను అనుసరించాల్సిన అవసరం ఉంది.

**ప్రత్యామ్నాయ కేంద్రాలు ఉన్నా..**

ప్రభుత్వం, జీహెచ్ఎంసీ ప్రత్యామ్నాయ నిమజ్జన కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నాయి. జీహెచ్ఎంసీ పరిధిలో 74 కృత్రిమ నిమజ్జన కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొంది. ఇందులో 24 తాత్కాలిక పోర్టబుల్ వాటర్ ట్యాంకులు, 23 తాత్కాలిక ఎక్స్కవేషన్ పాండ్లు, 27 శాశ్వత బేబీ పాండ్లు ఉన్నాయి. ఈ వ్యవస్థను మరింత సమర్థంగా వినియోగిస్తే సహజ చెరువులు, సరస్సులపై పడే కాలుష్య భారాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. అయితే కేవలం కేంద్రాలను ఏర్పాటు చేయడం సరిపోదు. ప్రతి ప్రాంతంలో వాటి సామర్థ్యం, నీటి నిర్వహణ, విగ్రహాల అవశేషాల తొలగింపు, వ్యర్థాల వేరు చేయడం, నిమజ్జనం తర్వాత శుభ్రపరిచే ప్రక్రియను ముందుగానే ప్రణాళిక చేయాలి.

**అధికారుల వైఫల్యమే ప్రధాన సమస్య?**

పర్యావరణవేత్తలు చెబుతున్న విమర్శల్లో కీలక అంశం అమలు వైఫల్యం. సుప్రీంకోర్టు, హైకోర్టు, ఎన్జీటీ పలు సందర్భాల్లో ఆదేశాలు ఇచ్చినా హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, కాలుష్య నియంత్రణ మండలి వంటి శాఖలు వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమవుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. ఇది కేవలం నిమజ్జనం రోజున పోలీసు బందోబస్తు లేదా ట్రాఫిక్ నిర్వహణ సమస్య కాదు. విగ్రహాల తయారీ దశ నుంచే పర్యావరణ నియంత్రణ ప్రారంభం కావాలి. పీఓపీ విగ్రహాల తయారీ, విక్రయం, వినియోగంపై స్పష్టమైన నియంత్రణ ఉండాలి. మట్టి విగ్రహాలను ప్రోత్సహించడంతో పాటు పర్యావరణహిత రంగుల వినియోగంపై అవగాహన కల్పించాలి.

**సంప్రదాయం--పర్యావరణం మధ్య సమతుల్యత**

భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి వంటి నిర్వాహక సంస్థలు దశాబ్దాలుగా కొనసాగుతున్న సంప్రదాయాన్ని ప్రస్తావిస్తూ హుస్సేన్‌సాగర్‌లోనే నిమజ్జనం చేయాలని కోరుతున్నాయి. భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా విగ్రహాల పరిమాణంపై కూడా ఆంక్షలు విధించకూడదని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే సంప్రదాయాన్ని కాపాడటం, పర్యావరణాన్ని రక్షించడం పరస్పర విరుద్ధమైన అంశాలుగా చూడాల్సిన అవసరం లేదు. భారీ విగ్రహాలకు ప్రత్యేక కృత్రిమ నిమజ్జన కేంద్రాలు, మట్టి విగ్రహాలకు స్థానికంగా చిన్న నిమజ్జన కుంటలు, నిమజ్జనం అనంతరం అవశేషాల శాస్త్రీయ నిర్వహణ వంటి చర్యలతో రెండు లక్ష్యాలను సమన్వయం చేయవచ్చు.

**ఆరు లక్షల విగ్రహాల నిమజ్జనం.. భారీ సవాల్**

ఈసారి రాష్ట్రవ్యాప్తంగా సుమారు ఆరు లక్షల చిన్న, మధ్యస్థ, పెద్ద విగ్రహాలు ఏర్పాటు కానున్నట్లు అంచనా. గత ఏడాది జీహెచ్ఎంసీ పరిధిలోనే మూడు లక్షలకు పైగా విగ్రహాలు ఏర్పాటు కాగా, వాటిలో మట్టి విగ్రహాల సంఖ్య నామమాత్రంగానే ఉండటం ఆందోళన కలిగించే అంశం. ఎక్కువ సంఖ్యలో పీఓపీ విగ్రహాలు ఉంటే నిమజ్జనం అనంతరం ఏర్పడే వ్యర్థాల నిర్వహణ మరింత క్లిష్టమవుతుంది. అందువల్ల నిమజ్జనం రోజున మాత్రమే కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టకుండా.. విగ్రహాల తయారీ నుంచి నిమజ్జనం, అవశేషాల సేకరణ, వ్యర్థాల శుద్ధి వరకు పూర్తి స్థాయి పర్యావరణ నిర్వహణ ప్రణాళిక అవసరం. ముగింపుగా, గణేష్ నిమజ్జనంపై ప్రతి ఏడాది కోర్టులు ఆంక్షలు విధించడం కంటే, వాటిని ముందుగానే ప్రజలకు అర్థమయ్యేలా వివరించి, ప్రత్యామ్నాయ వ్యవస్థలను సమర్థంగా అందుబాటులోకి తీసుకురావడం ప్రభుత్వ బాధ్యత. అదే సమయంలో నిర్వాహకులు, భక్తులు కూడా పర్యావరణ బాధ్యతను స్వీకరించాలి. పండుగ భక్తికి ప్రతీక అయితే.. ఆ భక్తి కారణంగా జలవనరులు కాలుష్యానికి గురికాకుండా చూడటం సమాజం మొత్తం బాధ్యత. పర్యావరణహిత వినాయక నిమజ్జనమే భవిష్యత్‌కు సరైన మార్గం.

# చలాన్ భయం కావాలా..

## ట్రాఫిక్ క్రమశిక్షణ రావాలా?



ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం.. చలాన్ పడటం.. కానీ దాన్ని వెంటనే చెల్లించకుండా "తర్వాత డిస్కౌంట్ వస్తుంది.. అప్పుడు కట్టేద్దాం" అని వాయిదా వేయడం.. చాలామంది వాహనదారుల్లో కనిపిస్తున్న ధోరణి. చలాన్ పడినా వెంటనే చెల్లించాల్సిన అవసరం లేదనే భావన ఉంటే.. నిబంధనల ఉల్లంఘనకు అడ్డుకట్ట ఎలా పడుతుంది? రోడ్డు భద్రత ఎలా మెరుగుపడుతుంది? ఈ పరిస్థితిని మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ చలాన్ల వసూళ్లను మరింత కఠినతరం చేసే దిశగా అడుగులు వేస్తున్నట్టు తెలుస్తోంది. వాహనం రిజిస్ట్రేషన్ సమయంలోనే బ్యాంక్ ఖాతా వివరాలను అనుసంధానం చేసి.. చలాన్ పడిన వెంటనే సంబంధిత మొత్తాన్ని ఆటో డెబిట్ చేసే విధానాన్ని తీసుకురావాలన్న ఆలోచన తెరపైకి వచ్చింది. టోల్ ప్లాజాల వద్ద ఫాస్టాగ్ ద్వారా పెండింగ్ చలాన్లను వసూలు చేసే అవకాశాలను కూడా పరిశీలిస్తున్నట్టు సమాచారం. ఈ విధానం అమల్లోకి వస్తే.. "చలాన్ పడింది.. తర్వాత చూద్దాం" అనే ధోరణికి కొంతవరకు అడ్డుకట్ట పడే అవకాశం ఉంది. ఎందుకంటే జరిమానా వెంటనే చెల్లించాల్సి వస్తే.. నిబంధనలు ఉల్లంఘించే ముందు వాహనదారుడు ఒకటికి రెండుసార్లు ఆలోచించే పరిస్థితి వస్తుంది. అయితే ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతుంది. జరిమానా వసూలు చేయడం మాత్రమే రోడ్డు భద్రతకు పరిష్కారమా? తప్పు చేసిన వ్యక్తి జరిమానా చెల్లించాల్సిందే. కానీ అదే సమయంలో తప్పు లేకుండా చలాన్ పడకుండా చూసే బాధ్యత కూడా ప్రభుత్వానిదే. సీసీటీవీ లేదా ఆటోమేటిక్ వ్యవస్థ ద్వారా తప్పుగా చలాన్ నమోదైతే.. దాన్ని సులభంగా సరిచేసుకునే అవకాశం ఉండాలి. వాహనం అమ్మిన తర్వాత పాత చలాన్ల పరిస్థితి ఏంటి? బ్యాంక్ ఖాతాలో సరిపడా డబ్బు లేకపోతే ఏం చేస్తారు? ఫాస్టాగ్ నుంచి మొత్తం కట్ చేయడం వల్ల ఎలాంటి సమస్యలు వస్తాయి? ఇలాంటి అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలు అవసరం. అంతేకాదు.. చలాన్లపై డిస్కౌంట్లు ఇవ్వడం కూడా మరోసారి ఆలోచించాల్సిన విషయమే. సమయానికి చలాన్ చెల్లించిన వ్యక్తి పూర్తి మొత్తం కడతాడు. కానీ నెలల తరబడి చెల్లించకుండా ఉంచిన వ్యక్తికి తర్వాత డిస్కౌంట్ వస్తే.. నిబంధనలు పాటించిన వ్యక్తికే అన్యాయం జరిగినట్టవుతుంది. కాబట్టి చలాన్ పడిన తర్వాత నిర్ణీత సమయంలో చెల్లించేలా వ్యవస్థ ఉండాలి. పాత పెండింగ్ చలాన్లకు ప్రత్యేక పరిష్కారం ఉండొచ్చు కానీ.. అది తరచూ జరిగే పద్ధతిగా మారకూడదు. ఇక ఫాస్టాగ్ నుంచి పెండింగ్ చలాన్లను వసూలు చేయాలన్న ఆలోచన మరింత కీలకం. టోల్ గేట్ వద్ద వాహనం ఆగగానే ఫాస్టాగ్ స్కాన్ చేసి.. టోల్ ఫీజుతో పాటు పాత చలాన్ల మొత్తాన్ని కూడా కట్ చేస్తే.. పెండింగ్ బకాయిలు భారీగా పేరుకుపోయే అవకాశం తగ్గుతుంది. కానీ ఇలాంటి విధానం అమలు చేయాలంటే బ్యాంకింగ్, పేమెంట్ వ్యవస్థలు, పౌరుల హక్కులకు సంబంధించిన నిబంధనలను స్పష్టంగా రూపొందించాలి. మరోవైపు.. ప్రభుత్వం చలాన్ల వసూళ్లపై ఎంత దృష్టి పెడుతుందో.. రోడ్డు భద్రతపై కూడా అంతే దృష్టి పెట్టాలి. ప్రమాదాలకు కేవలం వాహనదారుల నిర్లక్ష్యమే కారణం కాదు. రోడ్ల పరిస్థితి, సరైన సిగ్నలింగ్ లేకపోవడం, రోడ్డు లైటింగ్, బ్లాక్‌స్పాట్లు, అక్రమ పార్కింగ్, పాదచారుల భద్రత వంటి అంశాలు కూడా ప్రమాదాలకు కారణమవుతున్నాయి. కాబట్టి చలాన్ల ద్వారా వచ్చే ఆదాయాన్ని కూడా రోడ్డు భద్రతకు వినియోగించే విధానం ఉండాలి. ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి అభివృద్ధి చేయాలి. ట్రాఫిక్ సిగ్నలింగ్‌ను మెరుగుపరచాలి. పాదచారులకు సురక్షితమైన మార్గాలు కల్పించాలి. అదే సమయంలో ప్రజల్లో ట్రాఫిక్ అవగాహన పెంచాలి. ఎందుకంటే హెల్మెట్ పెట్టుకోవడం చలాన్ భయంతో కాదు.. ప్రాణం కోసం. సీట్‌బెల్ట్ పెట్టుకోవడం పోలీసుల కోసం కాదు.. ప్రమాదం నుంచి బయటపడటానికి. సిగ్నల్ వద్ద ఆగడం కెమెరా కోసం కాదు.. మనతో పాటు రోడ్డుపై ఉన్న ఇతరుల ప్రాణాలను కాపాడటానికి. అందుకే ప్రభుత్వం తీసుకురావాలనుకుంటున్న కొత్త విధానం కేవలం **డబ్బు వసూలు చేసే వ్యవస్థగా కాకుండా.. ట్రాఫిక్ సంస్కృతిని మార్చే వ్యవస్థగా ఉండాలి.**

**ప్రజలు కూడా ఒక విషయం గుర్తుంచుకోవాలి. "చలాన్ పడితే కడదాం" అనే ఆలోచన కంటే.. "చలాన్ పడే తప్పే చేయకూడదు" అనే ఆలోచన రావాలి.**

ప్రభుత్వం కూడా అదే దిశగా పనిచేయాలి. జరిమానాలు విధించడం అవసరమే.. కానీ వాటితో పాటు అవగాహన, పారదర్శకత, సాంకేతిక ఖచ్చితత్వం, రోడ్డు భద్రత చర్యలు కూడా ఉండాలి. చివరికి లక్ష్యం ఎన్ని కోట్ల చలాన్లు వసూలు చేశామన్నది కాదు.. ఎన్ని ఉల్లంఘనలు తగ్గించాం, ఎన్ని ప్రమాదాలు నివారించాం, ఎన్ని ప్రాణాలు కాపాడగలిగామన్నదే. బండి రోడ్డెక్కితే నిబంధనలు పాటించాలి..తప్పు చేస్తే జరిమానా తప్పక చెల్లించాలి..అదే సమయంలో చట్టాన్ని అమలు చేసే వ్యవస్థ కూడా ప్రజలకు న్యాయంగా, పారదర్శకంగా ఉండాలి. అప్పుడే చలాన్ వ్యవస్థ ప్రజలపై భారంగా కాకుండా.. ప్రజల ప్రాణాలను కాపాడే రోడ్డు భద్రతా సంస్కరణగా మారుతుంది.

# వైభవం కంటే శాశ్వతతే ముఖ్యం




గోదావరి పుష్కరాలు అనగానే ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్‌లోని రాజమహేంద్రవరం ప్రధానంగా గుర్తుకొచ్చేది. అయితే 2027 పుష్కరాలను తెలంగాణ ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రతిష్ఠకు ప్రతీకగా నిలపాలన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నం ఒక కీలకమైన అవకాశంగా చూడాలి. గోదావరి తెలంగాణలో ప్రవహించే జీవనది మాత్రమే కాదు.. రాష్ట్ర చరిత్ర, సంస్కృతి, ఆధ్యాత్మిక సంప్రదాయాలతో ముడిపడిన సహజ వారసత్వం. అందువల్ల పుష్కరాలను కేవలం ఒక మతపరమైన కార్యక్రమంగా కాకుండా, తెలంగాణ సాంస్కృతిక బ్రాండ్‌ను దేశవ్యాప్తంగా చాటే వేదికగా మలచాలన్న ఆలోచన స్వాగతించదగినదే. వచ్చే ఏడాది జూన్ 26 నుంచి జులై 7 వరకు జరిగే పుష్కరాల కోసం ప్రభుత్వం రూ. 1,000 కోట్లను కేటాయించడం భారీ నిర్ణయం. ఇంత పెద్ద మొత్తంలో ప్రజాధనం ఖర్చు చేస్తున్నప్పుడు దాని ఫలితం పన్నెండు రోజుల పుష్కరాలకే పరిమితం కాకూడదు. పుష్కరాల పేరుతో నిర్మించే ఘాట్లు, రహదారులు, తాగునీటి వసతులు, పారిశుద్ధ్య వ్యవస్థలు, వైద్య సదుపాయాలు, పార్కింగ్ ప్రాంతాలు తదితర మౌలిక వసతులు పుష్కరాల అనంతరం కూడా ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలి. మంత్రి కొండా సురేఖ సూచించినట్టుగా నిర్మాణాల నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వడం ఈ విషయంలో అత్యంత కీలకం. ప్రత్యేక అధికారి కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం కూడా సమన్వయ పరంగా మంచి నిర్ణయమే. పుష్కరాల సమయంలో ఒకే ప్రాంతంలో దేవాదాయ శాఖతో పాటు పోలీసు, వైద్య, పర్యాటక, రవాణా, మున్సిపల్, నీటిపారుదల తదితర శాఖలు కలిసి పనిచేయాల్సి ఉంటుంది. గతంలో పెద్ద ఆధ్యాత్మిక ఉత్సవాల్లో కనిపించిన సమన్వయ లోపాలు, ట్రాఫిక్ సమస్యలు, పారిశుద్ధ్య ఇబ్బందులు, భద్రతా లోపాలు పునరావృతం కాకుండా ముందస్తు కార్యాచరణ అవసరం. ప్రత్యేక కార్యాలయం కేవలం సమావేశాల కేంద్రంగా కాకుండా.. నిర్ణయాలు తీసుకుని వాటి అమలును పర్యవేక్షించే కమాండ్ సెంటర్‌గా పనిచేయాలి. అయితే పుష్కరాల వైభవాన్ని నిర్మాణాల పరిమాణంతో కొలవడం సరైంది కాదు. లక్షలాది మంది భక్తులు గోదావరిలో స్నానాలకు తరలివచ్చే సమయంలో నీటి భద్రత, పారిశుద్ధ్యం, పర్యావరణ పరిరక్షణ అత్యంత ప్రాధాన్యత పొందాలి. ఘాట్ల వద్ద పటిష్టమైన గ్రిల్స్, జారిపడకుండా మెట్లు, తగినంత వెలుతురు, మహిళలకు సురక్షితమైన దుస్తులు మార్చుకునే గదులు, అత్యవసర వైద్య కేంద్రాలు, అంబులెన్స్‌లు, శిక్షణ పొందిన రక్షణ బృందాలు తప్పనిసరి. భక్తుల సంఖ్యను అంచనా వేసి కాకుండా, అత్యధిక రద్దీని దృష్టిలో పెట్టుకుని మౌలిక వసతులను రూపొందించాలి. ఇక పర్యావరణ పరంగా మరింత జాగ్రత్త అవసరం. పుష్కరాల పేరుతో గోదావరి పరిసరాల్లో విచ్చలవిడిగా కాంక్రీట్ నిర్మాణాలు చేపడితే అది నదికి మేలు చేయదు. నదీ ప్రవాహ మార్గం, వరద ముప్పు ప్రాంతాలు, సహజ తీర ప్రాంతాలను పరిగణనలోకి తీసుకుని నిర్మాణాలు చేపట్టాలి. ఒకసారి నిర్మించిన ఘాట్లు భవిష్యత్తులో వరదలను తట్టుకునేలా ఉండాలి. ప్లాస్టిక్ వ్యర్థాలు, పూజా సామగ్రి, మురుగునీరు నదిలో కలవకుండా శాస్త్రీయ వ్యర్థ నిర్వహణ వ్యవస్థను ఏర్పాటు చేయడం అత్యవసరం. నేపాల్ వరదలను ఉదాహరణగా తీసుకుని మంత్రి చెప్పిన 'నాణ్యత' అంశం ఇక్కడ ప్రత్యేకంగా ప్రస్తావించదగినది. ప్రకృతి వైపరీత్యాల సమయంలో నిర్మాణాల అసలు సామర్థ్యం బయటపడుతుంది. పుష్కరాల కోసం వేగంగా పనులు పూర్తి చేయాలనే తొందరలో నాణ్యతను రాజీ చేయడం భవిష్యత్తులో ప్రాణ, ఆస్తి నష్టాలకు కారణమవుతుంది. కాబట్టి ప్రతి నిర్మాణానికి నాణ్యతా ప్రమాణాలు, స్వతంత్ర తనిఖీలు, పారదర్శక టెండర్ విధానం, బాధ్యత వహించే అధికార వ్యవస్థ ఉండాలి. అదే సమయంలో పుష్కరాలను తెలంగాణ సంస్కృతికి ప్రతిబింబంగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యం కేవలం అలంకరణలకే పరిమితం కాకూడదు. స్థానిక కళలు, జానపద సంప్రదాయాలు, దేవాలయ వారసత్వం, గిరిజన సంస్కృతి, తెలంగాణ ఆహార వైవిధ్యాన్ని భక్తులకు పరిచయం చేసేలా కార్యక్రమాలు రూపొందించాలి. దీంతో పుష్కరాలు ఆధ్యాత్మిక యాత్రతో పాటు సాంస్కృతిక పర్యాటకానికి కూడా ఊతమిస్తాయి. మొత్తంగా చూస్తే.. 'గోదావరి పుష్కరాలు అంటే తెలంగాణ' అనే గుర్తింపు రావాలంటే భారీ బడ్జెట్ ఒక్కటే సరిపోదు. నాణ్యమైన నిర్మాణాలు, సమర్థవంతమైన నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ, భక్తుల భద్రత, పారదర్శకత, శాశ్వత మౌలిక వసతులు కలిసి రావాలి. పన్నెండు రోజుల ఉత్సవం ముగిసిన తర్వాత కూడా ఆ రూ. 1,000 కోట్ల పెట్టుబడి ప్రజల జీవితాల్లో కనిపిస్తేనే పుష్కరాల విజయం నిజమైన అర్థాన్ని సంతరించుకుంటుంది. ప్రభుత్వం ఇప్పుడు చేయాల్సింది 'వైభవం' కోసం మాత్రమే కాదు.. భవిష్యత్ తరాలకు ఉపయోగపడే గోదావరి తీరం కోసం ప్రణాళిక వేయడం.

# మహానగరంలో మరో ఘాతుకం..



**తుక్కుగూడ,ఫ్లాష్ ఇండియా :** తుక్కుగూడలో నర్సు శిరీష హత్య కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. ఒంటరిగా ఉన్న సమయంలో శిరీషపై లైంగిక దాడికి ప్రయత్నించి, అనంతరం ఆమెను హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఘటనకు సంబంధించి బిహార్‌కు చెందిన కార్ల మెకానిక్ మహ్మద్ సనావుల్లా (34)ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఖమ్మం జిల్లా ముల్కలపల్లి మండలానికి చెందిన 21 ఏళ్ల శిరీష సుమారు ఎనిమిది నెలల క్రితం తుక్కుగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సుగా చేరింది. ఆస్పత్రి ఆవరణలో ఉన్న హాస్టల్‌లో తోటి నర్సులతో కలిసి ఉంటోంది. రాఖీ పండుగ సందర్భంగా రూమ్‌మేట్స్ స్వగ్రామాలకు వెళ్లడంతో శుక్రవారం రాత్రి శిరీష తన గదిలో ఒంటరిగా నిద్రించింది. శనివారం మధ్యాహ్నం వరకు శిరీష గది నుంచి బయటకు రాకపోవడంతో సిబ్బందికి అనుమానం వచ్చింది. కిటికీలోంచి చూడగా ఆమె విగతజీవిగా కనిపించింది. దీంతో పహాడీషరీఫ్ పోలీసులు తొలుత అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో లభించిన ఆధారాల ఆధారంగా లైంగిక దాడి, హత్య కోణంలో విచారణ చేపట్టారు. చివరకు ఆస్పత్రి సమీపంలోని కార్ల మెకానిక్ షాపులో పనిచేస్తున్న సనావుల్లా ఈ నేరానికి పాల్పడినట్లు పోలీసులు గుర్తించినట్లు సమాచారం. ఇతర కార్మికులు వెళ్లిపోయిన తర్వాత అతడు అక్కడే నిద్రించేవాడని, కొంతకాలంగా ఆస్పత్రిలో పనిచేస్తున్న నర్సుల కదలికలను గమనించినట్లు దర్యాప్తులో తేలింది. శిరీష ఒంటరిగా ఉన్న విషయాన్ని గమనించిన సనావుల్లా.. అర్ధరాత్రి హాస్టల్‌లోకి ప్రవేశించినట్లు పోలీసులు గుర్తించారు. శిరీష ఉంటున్న గది కిటికీకి గ్రిల్స్ లేకపోవడంతో అదే మార్గం ద్వారా లోపలికి వెళ్లినట్లు తెలుస్తోంది. లైంగిక దాడికి ప్రయత్నించగా శిరీష ప్రతిఘటించి కేకలు వేయడంతో ఆమె గొంతు నులిమి హత్య చేసినట్లు విచారణలో వెల్లడైంది. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. అయితే ఈ ఘటనలో సనావుల్లా ఒక్కడే ఉన్నాడా? మరెవరైనా సహకరించారా? అనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఫోరెన్సిక్ నివేదిక అందిన తర్వాత కేసుకు సంబంధించి మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా నిందితుడు ఆదివారం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీలో శిరీష మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టం నివేదికలో ఆమెపై లైంగిక దాడి జరిగినట్లు నిర్ధారణ అయినట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం పూర్తైన అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

# మహిళలు బంగారంతో సమానం..

**కేరళ :** దేశంలో మహిళలు తమ ఇళ్లకే పరిమితం కావాలని, వారు బహిరంగ ప్రదేశాల్లోకి రాకూడదని ప్రముఖ కేరళ మతబోధకుడు షేక్ అబూబకర్ అహ్మద్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఇస్లాంలో మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకే హిజాబ్ పద్ధతిని సూచించారని, మహిళలను బయటకు తీసుకురావడం వల్ల తీవ్ర వినాశనం రుగుతుందని ఆయన కామెంట్ చేశారు.

**మహిళలను బంగారు హారంతో పోలుస్తూ..**

కొచ్చిలో జరిగిన హుబ్బుల్ రసూల్ సదస్సులో అఖిల భారత సున్నీ జమియ్యతుల్ ఉలమా, సమస్త కేరళ జెమ్-ఇయ్యతుల్ ఉలమా ప్రధాన కార్యదర్శిగా ఉన్న షేక్ అబూబకర్ అహ్మద్ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మహిళలను బంగారు ఆభరణాలతో పోల్చారు. 'ఒకరు జ్యువెలరీ షాప్‌లో బంగారు హారాన్ని కొనుగోలు చేసేటప్పుడు దానిని కప్‌బోర్డ్‌లోని పెట్టెలో, పేపర్‌లలో భద్రంగా దాచి చూపిస్తారు. అదే రోడ్డు పక్కన అమ్మే రుబ్బురోళ్లను అందరూ తొక్కుతూ వెళ్తారు. బంగారు హారం దాని అందాన్ని, విలువను కాపాడుకోవాలంటే పెట్టెలోనే భద్రంగా ఉండాలి. రోడ్డుపై పెడితే వెళ్లే ప్రతి ఒక్కరూ తాకి దాని అందాన్ని పాడుచేస్తారు. మహిళలను కూడా ఇలాగే బహిరంగ సమాజంలోకి తీసుకొస్తే పెద్ద వినాశనానికి దారితీస్తుంది' అని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రాచీన అరేబియాలో ఆడపిల్లలను నిలువునా పూడ్చిపెట్టే అనాచారాన్ని ఇస్లాం నిషేధించిందని, ఆస్తి హక్కులు లేని కాలంలోనే మహిళలకు ఆస్తి హక్కులు కల్పించిందని గుర్తుచేశారు. గత 100 ఏళ్లుగా తమ మత పండితులు ఇదే విషయాన్ని బోధిస్తున్నారని, దీనివల్లే దేశంలోని మహిళలు తమ గౌరవాన్ని కాపాడుకోగలుగుతున్నారని షేక్ అబూబకర్ అహ్మద్ అన్నారు.

**వివాదాస్పద వ్యాఖ్యలపై నిరసన జ్వాలలు..**

షేక్ అబూబకర్ అహ్మద్ చేసిన వ్యాఖ్యలపై కేరళ రాష్ట్రంలోని మహిళా సంఘాలు, మానవ హక్కుల నాయకులు, సోషల్ మీడియాలో నెటిజన్లు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. 21వ శతాబ్దంలో సమానత్వం, మహిళా సాధికారత గురించి మాట్లాడుతుంటే.. మహిళలను వస్తువులతో పోలుస్తూ వారి స్వేచ్ఛను హరించేలా మాట్లాడటం అజ్ఞానానికి పరాకాష్ట అని ఫైర్ అవుతున్నారు.

# బోడుప్పల్, పోచారం సర్కిళ్ల సమస్యలపై జోనల్ కమిషనర్‌తో చర్చించిన మాజీ మేయర్ అజయ్ యాదవ్




**మేడిపల్లి,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధి బోడుప్పల్, పోచారం సర్కిళ్ల పరిధిలోని ప్రజా సమస్యలు, అభివృద్ధి పనులపై మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తా ఐఏఎస్ తో సమావేశమై చర్చించారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించి, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో బి-బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, పోచారం డివిజన్ అధ్యక్షుడు కర్రె రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్ఎస్ పోరుబాట..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో 1000 రోజుల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనా వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టేందుకు ప్రతిపక్ష భారత రాష్ట్రీయ సమితి పోరుబాటకు సిద్ధమైంది. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో సర్కార్ విఫలమైందంటూ సెప్టెంబర్ 2 నుంచి రాష్ట్రవ్యాప్తంగా వరుస నిరసన కార్యక్రమాలు చేపట్టేందుకు పార్టీ నాయకత్వం పిలుపునిచ్చింది. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన 420 హామీలతో పాటు 13 డిక్లరేషన్లను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ ఆరోపించింది. ఈ అంశాలన్నింటినీ ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి ఎండగట్టడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పోరుబాట పట్టనున్నట్లుగా స్పష్టం చేసింది.

**ఆరు గ్యారెంటీల వైఫల్యంపై జంగ్..**

అధికారంలోకి వచ్చిన తర్వాత హస్తం పార్టీ ఆరు గ్యారెంటీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ విమర్శించింది. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా సెప్టెంబర్ 2 నుంచి చేపట్టే ఈ కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చింది.



# ఏ ప్రభుత్వమైనా దోపిడి విధానాలు మారలేదు

**సిద్ధిపేట,ఫ్లాష్ ఇండియా :** భూమి వివరాల కోసం బీఆర్ఎస్ హయాంలో తీసుకొచ్చిన ధరణి కంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి ఇంకా దరిద్రంగా ఉందని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు మండిపడ్డారు. 22 ఏ తో దాదాపు 50 లక్షల మంది ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 22 ఏ జీవో రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం సిద్ధిపేట ఆర్డీఓ కార్యాలయం ఎదుట బీజేపీ మహాధర్నా నిర్వహించింది. ఈ ధర్నాలో మెదక్ ఎంపీ రఘునందన్ రావుతో కలిసి రామచంద్రరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ బీజేపీ చీఫ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అర్థం లేని విధానాల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తప్పు జరిగిందని ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రి ఒప్పుకున్నారని గుర్తు చేశారు. తప్పును మాత్రం సరిదిద్దుకోవడం లేదంటూ కాంగ్రెస్ ప్రభుత్వంలోని పెద్దలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాడు బీఆర్ ఎస్ అయినా.. నేడు కాంగ్రెస్ అయినా టైటిల్ మారింది తప్ప, దోపిడి విధానాలు మారలేదని వ్యంగ్యంగా అన్నారు. 403 సర్వే నెంబర్‌లో కేవలం రెండు ప్లాట్లు సమస్యల్లో ఉంటే వేలాది ప్లాట్లను నిషేధిత జాబితాలో చేర్చారని వివరించారు. అదే సర్వే నెంబర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇల్లు కూడా ఉందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఇల్లు మాత్రం 22 ఏ నుంచి బయటకు ఎలా వచ్చిందంటూ ఆయన సందేహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం 30 శాతం కమిషన్‌తో నడుస్తున్నదని ఎద్దేవా చేశారు. పేదల భూములు గుంజుకుని ప్రభుత్వం అమ్ముకుంటున్నదని విమర్శించారు. తమ భూములు కాపాడండంటూ పేద రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారని చెప్పారు. 22 ఏ నిషేధిత జాబితాపై శ్వేత పత్రం విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 22 ఏపై స్వతంత్ర సంస్థతో విచారణ జరపాలని ప్రభుత్వానికి సవాల్ విసిరారు. రైతుల కోసం బీజేపీ పోరాడుతుందని స్పష్టం చేశారు. వారి కోసం జైలుకైనా వెళ్తామని పేర్కొన్నారు. అసెంబ్లీ ప్రారంభమయ్యే లోపు ప్రభుత్వం 22ఏ రద్దుపై నిర్ణయం తీసుకోవాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి బీజేపీ చీఫ్ రామచందర్ రావు సూచించారు.

# ఢిల్లీలో నిర్భయ తరహా దారుణం

**ఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో నిర్భయ ఘటనను తలపించే మరో దారుణం వెలుగుచూసింది. ఉత్తరప్రదేశ్ నుంచి వస్తున్న 16 ఏళ్ల మైనర్ బాలికపై కదులుతున్న స్లీపర్ బస్సులోనే డ్రైవర్, కండక్టర్ కలిసి విచక్షణారహితంగా గ్యాంగ్ రేప్‌కు పాల్పడ్డారు. ఆగస్టు 4న చోటుచేసుకున్న ఉందంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితురాలి కుటుంబ సభ్యులు, బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితులైన డ్రైవర్ కుల్దీప్, కండక్టర్ సందీప్‌లను అరెస్టు చేశారు.

**47 కి.మీ ప్రయాణంలో అమానుషం..**

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌లోని మైన్‌పురి జిల్లాకు చెందిన 16 ఏళ్ల విద్యార్థిని కుటుంబ సభ్యులతో గొడవపడి నోయిడాలోని తన బంధువుల ఇంటికి వెళ్లేందుకు బయలుదేరింది. ఈ క్రమంలో ఆమె గ్రేటర్ నోయిడాలోని పరిచౌక్ వద్ద ఢిల్లీ వైపు వెళ్తున్న ఓ ప్రైవేట్ స్లీపర్ బస్సు ఎక్కింది. గ్రేటర్ నోయిడాలోని పరిచౌక్ నుంచి ఢిల్లీలోని కశ్మీరీ గేట్ వరకు ఉన్న దాదాపు 47 కి.మీ ప్రయాణ దూరంలో ఈ దారుణం జరిగింది.

**బస్సు విండోలకు ఉన్న తెరలు దించి..**

అయితే, స్లీపర్ బస్సు కిటికీలకు తెరలు వేసి ఉండటంతో లోపల ఏం జరుగుతుందో బయటి వారికి కనిపించకుండా పోయింది. ఈ అవకాశాన్ని ఆసరాగా చేసుకున్న బస్సు డ్రైవర్ కుల్దీప్, కండక్టర్ సందీప్‌లు కదులుతున్న బస్సులోనే బాలికపై అమానుషంగా అత్యాచారానికి ఒడిగట్టారు. దారుణం ముగిశాక బాలికను ఢిల్లీలోని కశ్మీరీ గేట్ బస్ స్టాండ్ వద్ద దింపి నిందితులు పరారయ్యారు. అనంతరం అచేతన స్థితిలో ఉన్న బాధితురాలు కుటుంబ సభ్యులకు సమాచారం అందజేయడంతో వారు స్పాట్‌కు చేరుకుని ఆమెను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. ఇచ్చిన ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు బస్సు సమాచారం ఆధారంగా విచారణ జరిపి డ్రైవర్ కుల్దీప్, కండక్టర్ సందీప్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

# యువజన సంఘాలకు పెరిగిన మద్దతు..

**గన్నేరువరం,ఫ్లాష్ ఇండియా :** డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరుతూ యువజన సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 24 గంటల నిరాహార దీక్ష కార్యక్రమం పోలీసుల పహారా ఉన్నప్పటికీ అనుకున్న సమయానికి దీక్ష చేపట్టే స్థలానికి చేరుకొని యువజన సంఘాల సంకల్ప బలాన్ని నిరూపించారు. పోలీసులు బల ప్రయోగం చేసి వారిని వాహనాల్లోకి ఎక్కించి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ తరుణంలో పోలీసులకు యువజన సంఘాలకు జరిగిన ఘర్షణ తోపులాట చూసిన ప్రజానీకం ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రానికి రావడానికి కనీసం రోడ్డు వేయమని యువజన సంఘాలు పోరాటం చేస్తుంటే పోలీసులు వారిపై అణచివేత కార్యక్రమాలు చేయడమేంటని ఆగ్రహించారు. వివిధ ప్రాంతాల పోలీస్ అధికారులు ప్రత్యేక బలగాలు ఆ మార్గంలోనే గతుకుల రోడ్డు పై ప్రయాణించి వచ్చారు కదా రోడ్డు పరిస్థితి మీకు అర్థం కాలేదా అని బాహాటంగా ప్రశ్నించారు.

**యువజన సంఘాలకు పెరిగిన మద్దతు..**

డబుల్ రోడ్డు కోసం నాడు నేడు పోరాటం చేసింది యువజన సంఘాలే అయినప్పటికీ ఆదివారం నిర్వహించిన నిరాహార దీక్ష కార్యక్రమానికి ప్రధాన ప్రతిపక్ష పార్టీలు బిజెపి, బి ఆర్ ఎస్, సిపిఐ, జనసేన, టిఆర్ఎస్ పార్టీలతోపాటు పలు కుల సంఘాలు మద్దతు పలకడంతో యువజన సంఘాల బలం బలగం పెరిగిందని మండల ప్రజలు అనడంతో పాటు రోడ్డు కోసం చేసిన పోరాటాన్ని చూసి హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**ప్రభావం చూపని కాంగ్రెస్ డైవర్షన్ పాలిటిక్స్..**


యువజన సంఘాల నిరాహార దీక్ష కార్యక్రమం విజయవంతం కాకూడదని అధికార కాంగ్రెస్ నాయకులు పోలీసులను ఉపయోగించి దీక్షను భగ్నం చేశారని యువజన నాయకులను అరెస్టు చేశారని ఆరోపణలు చేస్తున్నప్పటికీ కాంగ్రెస్ పార్టీ యువజన సంఘాల దీక్ష ప్రభావాన్ని డైవర్ చేయడానికి యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల నిర్మూలన పేరుతో యువ చైతన్య ర్యాలీని నిర్వహించారని అంతటితో ఆగకుండా ఆ ర్యాలీకి కొంతమంది యువజన నాయకులు గంజాయి మత్తు మందులు తీసుకొని అంతరాయం కలిగించడానికి వచ్చిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారని వారిపై నార్కోటిక్ పరీక్షలు నిర్వహించనున్నారని సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెడుతూ యువజన సంఘాల రోడ్డు పోరాటాన్ని డైవర్ట్ చేయడానికి ప్రయత్నించారు. అయినప్పటికీ ప్రజలంతా యువజన సంఘాల పోరాటాన్ని సమర్థించారు. కాంగ్రెస్ పార్టీలో ఉండి యువజన సంఘాల పోరాటానికి పరోక్షంగా మద్దతు పలికిన నాయకులకు యువజన సంఘాల నాయకులు ధన్యవాదాలు తెలిపారు.

**యువజన సంఘాల నాయకుల అరెస్టును ఖండించిన రసమయి..**

డబుల్ రోడ్డు పనులు వెంటనే చేపట్టాలని యువజన సంఘాల నాయకులు 24 గంటల నిరాహార దీక్ష చేపడితే దానిని పోలీస్ నిర్బంధంతో విఫలం చేయడమే కాకుండా వారిని బలవంతంగా అరెస్ట్ చేయడం ను మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఖండించారు. సోషల్ మీడియా వేదికగా ఓ వీడియోను పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువజన సంఘాలకు సమాధానం చెప్పలేక కాంగ్రెస్ నాయకులచే మత్తు పదార్థాల నిర్మూలన ర్యాలీ నిర్వహించడం కాంగ్రెస్ పార్టీ నాయకుల చేతగానితనమని అన్నారు. క్యాంప్ ఆఫీసుకు అతి దగ్గరలో మహాత్మా నగర్ లో గంజాయి విక్రయాలు జరుగుతూ ఒకవైపు పట్టు పడుతుంటే ప్రశాంతమైన గన్నేరువరంలో అది యువజన సంఘాలు దీక్ష చేస్తున్న సమయంలో ర్యాలీ నిర్వహించాల్సిన అవసరం ఏంటని ప్రశ్నించారు. ఇది కేవలం యువజన సంఘాల పోరాటాన్ని డైవర్ట్ చేయడమే అని అన్నారు. వెంటనే రోడ్డు పనులు ప్రారంభించాలని లేని పక్షాన యువజన సంఘాలకు గన్నేరువరం మండల ప్రజలకు ఎమ్మెల్యే కవంపల్లి సత్యనారాయణ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. యువజన సంఘాల నాయకులతో పాటు బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తల పైన కేసులు నమోదు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. వెంటనే రోడ్డు పనులు ప్రారంభించని పక్షాన బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో యువజన సంఘాలతో కలిసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.


# భూభారతితో సర్వే చేసి..

## వారి జీవితాలకు భరోసానిచ్చి..



**నారాయణపురం,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో రైతన్నల సమస్యలు అన్నింటినీ ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నాం. ఇది మా ప్రభుత్వం నిబద్ధత. రాష్ట్రంలో రెవెన్యూ, గృహనిర్మాణ సమస్యల పరిష్కారం లక్ష్యంగా సాగుతున్న రాష్ట్ర వ్యాప్త పర్యటనలో భాగంగా ఈ రోజు మహబుబాబాద్ జిల్లా నారాయణపురంలో దాదాపు 60 ఏండ్ల నుండి పరిష్కారం కాకుండా ఉన్న పేద రైతుల అసైన్డ్ భూసమస్యలను భూభారతి రిసర్వేతో పరిష్కరించి, వారికి ఈరోజు భూఆధార్ తో కూడిన పట్టాదార్ పాసుబుక్కులు ఇవ్వడం జరిగింది. రాష్ట్రంలో 125 సంవత్సరాల క్రితం భూసర్వే జరిగింది. అప్పటి నుంచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో కూడా ఎవరూ సర్వే చేయలేదు. చివరికి కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో పదేండ్లు రాష్ట్రాన్ని పాలించిన గత పాలకులు కనీసం ఆలోచన చేయలేదు. గౌరవం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టింది. గత ప్రభుత్వం తెచ్చిన ధరణి ని బంగాళాఖాతంలో వేసి భూయజమానులకు చుట్టంలాంటి భూభారతి చట్టాన్ని తెచ్చి దశాబ్దాల భూ సమస్యలకు పరిష్కారం చేస్తుంది. భూవివాదాలులేని తెలంగాణగాను తీర్చిదిద్దడమే సంకల్పంగా రాష్ట్రంలో ప్రతి అంగుళం భూమిని సర్వే చేస్తున్నాం. అనంతరం క్యూఆర్ కోడ్, మ్యాప్ తో కూడిన పట్టాపాస్‌బుకులను రైతన్నలు, భూయజమానులకు అందిస్తున్నాం. అందులో భాగంగానే మహబూబాబాద్ జిల్లాలో కేసముద్రం మండలం నారాయణపురంలో సర్వే పూర్తి చేసుకున్న సుమారు 1378 ఎకరాల అసైన్డ్ భూమి కి సంబంధించిన 780 మంది రైతులకు భూపట్టాలను పంపిణీ చేయడం జరిగింది. నారాయణపురంలో ఇంకా మిగిలి ఉన్న తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్న సుమారు 150 ఎకరాల అసైన్డ్ భూమి విషయంలో త్వరలోనే సమస్యను పరిష్కరించి ఆ రైతులకు కూడా న్యాయం చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. పదేండ్లు అధికారంలో ఉండి దశాబ్దాలుగా భూసమస్యలతో ప్రజలు సతమతమవుతుంటే పట్టించుకోని బీఆర్ఎస్ ప్రబుద్ధులు ఇప్పుడు భూ సమస్యల మీద మాట్లాడడం సిగ్గుచేటు. వారికి ప్రజాప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు లేదు. ప్రతిపక్ష నాయకులతో చెప్పించుకునే పరిస్థితుల్లో ఈ ప్రజాప్రభుత్వం లేదు. ఆ పరిస్థితి ఎప్పుడు కూడా ఈ ప్రభుత్వానికి రాదు.

# శ్రీ శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొన్న బొడిగె కృష్ణ గౌడ్



**మేడిపల్లి,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ మేడిపల్లి 9వ డివిజన్ లోని సాయి ప్రియ నగర్ కాలనీలో సాయి ప్రియ యూత్ అసోసియేషన్ మరియు కాలనీ వాసుల ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ విగ్రహ శిఖర ప్రతిష్టాపన మహోత్సవ వేడుకల్లో పీర్జాదిగూడ మాజీ కార్పొరేటర్ బొడిగె స్వాతి కృష్ణ గౌడ్ పాల్గొని అమ్మవారి ఆలయ నిర్మాణంలో భాగంగా తనవంతుగా 50,000/-వేల రూపాయలు చెందాను, అసోసియేషన్ వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మేడ్చల్ డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ గారు, మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, మాజీ సర్పంచ్ బోడిగే రాందాస్ గౌడ్ , టీ .రవి , బండి శ్రీరాములు, యాసారం మహేష్, కె.వి గౌడ్ పాల్గొన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్ష కార్యదర్శులు కాలనీవాసులు మహిళలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 1 నుంచి ఎరువుల బుకింగ్‌కు ఎఫ్‌ఎఫ్‌ఎస్ యాప్




**జనగామ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** జిల్లాలో రైతులకు అవసరమైన ఎరువులను సకాలంలో, పారదర్శకంగా అందించేందుకు ఎరువుల విక్రయ వ్యవస్థ (ఎఫ్ఎఫ్ఎస్) యాప్ ద్వారా ఎరువుల బుకింగ్ విధానం 01.09.2026 నుంచి అమల్లోకి రానుందని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అమలులో ఉన్న యూరియా బుకింగ్ యాప్ స్థానంలో 01.09.2026 నుంచి ఎరువుల విక్రయ వ్యవస్థ (ఎఫ్ఎఫ్ఎస్) యాప్ ద్వారా ఎరువుల బుకింగ్ ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు. అందువల్ల జిల్లాలోని రైతులు ఈ మార్పును గమనించి, ఇకపై ఎరువుల బుకింగ్ కోసం ఎఫ్ఎఫ్ఎస్ యాప్‌ను వినియోగించుకోవాలని సూచించారు. ఎఫ్ఎఫ్ఎస్ అంటే ఎరువుల విక్రయ వ్యవస్థ అని, రైతులకు అవసరమైన యూరియా, డీఏపీ, ఎంఓపీ (పొటాష్), కాంప్లెక్స్ తదితర సబ్సిడీ ఎరువులను డిజిటల్ విధానంలో పారదర్శకంగా అందించేందుకు ఈ వ్యవస్థ ఉపయోగపడుతుందని తెలిపారు. రైతులు తమ మొబైల్ ఫోన్లలో ఎఫ్ఎఫ్ఎస్ యాప్‌ను వినియోగించి, రైతు గుర్తింపు సంఖ్య (ఫార్మర్ ఐడీ) / వ్యవసాయ సమాచార నిల్వ (అగ్రిస్టాక్) వివరాల ఆధారంగా అవసరమైన ఎరువు రకం, పరిమాణం, ఎరువు అందుబాటులో ఉన్న విక్రయ కేంద్రాన్ని ఎంపిక చేసుకొని బుకింగ్ చేసుకోవచ్చన్నారు. బుకింగ్ పూర్తయిన అనంతరం రూపొందే క్యూఆర్ కోడ్ / బుకింగ్ వివరాలతో ఎంపిక చేసిన ఎరువుల విక్రయ కేంద్రానికి వెళ్లి, సంబంధిత ధృవీకరణ ప్రక్రియ పూర్తిచేసి ఎరువులను పొందవచ్చని తెలిపారు. ఎఫ్ఎఫ్ఎస్ విధానం ద్వారా రైతులకు ఎరువుల లభ్యతపై ముందుగానే సమాచారం అందడంతో పాటు, అనవసరంగా వివిధ విక్రయ కేంద్రాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి తగ్గుతుందని పేర్కొన్నారు. అదే సమయంలో ఎరువుల నిల్వలు, బుకింగ్ మరియు విక్రయాలను పర్యవేక్షించడం ద్వారా ఎరువుల పంపిణీలో మరింత పారదర్శకత సాధ్యమవుతుందని తెలిపారు. రైతులు తమ సాగు విస్తీర్ణం, పంట అవసరాలకు అనుగుణంగా మాత్రమే ఎరువులను బుక్ చేసుకోవాలని సూచించారు. రైతులు తమ ఓటీపీ, రైతు గుర్తింపు సంఖ్య తదితర వ్యక్తిగత వివరాలను ఇతరులతో పంచుకోవద్దని కోరారు. ఎరువుల విక్రయదారులు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, రైతులకు అందుబాటులో ఉన్న ఎరువుల వివరాలను పారదర్శకంగా తెలియజేయాలన్నారు. కృత్రిమ కొరత సృష్టించడం, అధిక ధరలకు విక్రయించడం, రైతులను ఇతర ఉత్పాదకాలను కొనుగోలు చేయాలని బలవంతం చేయడం వంటి నిబంధనలకు విరుద్ధమైన చర్యలకు పాల్పడితే సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎఫ్ఎఫ్ఎస్ యాప్ వినియోగంపై సందేహాలు లేదా సాంకేతిక సహాయం అవసరమైన రైతులు తమ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ), మండల వ్యవసాయ అధికారి (ఎంఏఓ) లేదా సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. 01.09.2026 నుంచి ప్రస్తుత యూరియా బుకింగ్ యాప్ స్థానంలో అమల్లోకి వస్తున్న ఎఫ్ఎఫ్ఎస్ యాప్‌ను జనగామ జిల్లా రైతులందరూ సద్వినియోగం చేసుకొని, ఎరువుల పంపిణీ ప్రక్రియను విజయవంతం చేయడంలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# జోన్ కమిషనర్ ను కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**ఉప్పల్,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** ఉప్పల్ నియోజకవర్గంలోని వివిధ అభివృద్ధి పనుల కోసం అవసరమైన నిధులను మంజూరు చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జోన్ కమిషనర్ రాధిక గుప్త (ఐఏఎస్ ) కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న రోడ్లు,పారిశుద్ధ్యం, వీధి దీపాలు తదితర మౌలిక వసతుల అభివృద్ధి పనులకు తగిన నిధులు కేటాయించి, పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఉప్పల్ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటూ, అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేయడానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు గంధం నాగేశ్వరరావు, సాయిజెన్ శేఖర్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ విరమణ చేసిన అరుణ కుమారి

## ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి



**నల్లగొండ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** పట్టణంలోని నాగార్జున ప్రభుత్వ కళాశాల రసాయన శాస్త్ర విభాగంలో సహాయ ఆచార్యులుగా పనిచేస్తున్న టి. అరుణకుమారి సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా కళాశాల స్టాఫ్ క్లబ్ తరపున ఆమెను ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రిన్సిపాల్ ఆచార్య సముద్రాల ఉపేందర్ మాట్లాడుతూ, ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని అన్నారు. ప్రతి విద్యార్థి జీవితంలో ఎంతో మంది అధ్యాపకులు ఉంటారని అయినా అంకితభావం, సేవాతత్పరత ఉన్న అధ్యాపకులే విద్యార్థుల గుండెల్లో ఎప్పటికీ నిలిచిపోతారని అన్నారు. అలాంటి స్ఫూర్తిదాయకమైన అధ్యాపకుల్లో అరుణకుమారి ఒకరని ఆమె సేవలను కొనియాడారు. విరమణ ఉద్యోగానికే కానీ జీవితానికి కాదని, ఉద్యోగ విరమణ తరువాత నచ్చిన జీవితాన్ని నచ్చిన విధంగా గడిపే అవకాశం ఉందని అన్నారు. రేపటి నుంచి కుటుంబ జీవితంతో పాటు అరుణకుమారి సామాజిక సేవలో నిమగ్నం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డా. పరంగి రవి కుమార్, ప్రొఫెసర్ అంతటి శ్రీనివాసులు, పరీక్షల నియంత్రణాధికారి డా. డి. మునిస్వామి, విద్యాత్మిక సమన్వయ కర్త బి. నాగరాజు, ఎన్ ఎస్ ఎస్ విశ్రాంత లైజన్ ఆఫీసర్ సత్యనారాయణ రెడ్డి, స్టాఫ్ క్లబ్ కార్యదర్శి సుధాకర్, తెలుగుశాఖ అధ్యక్షులు డా. వెల్దశీడి శ్రీధర్, అధ్యాపకులు డా. అనిల్ అబ్రహం, డా. అనిల్ బొజ్జ, డా. అదే మల్లేశం, వెంకట్ రెడ్డి, శివరాణి, అరుణకుమారి కుటుంబ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# డివిజన్ స్థాయి ప్రజావాణికి 17 ఫిర్యాదులు



**మిర్యాలగూడ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** మిర్యాలగూడ సబ్ కలెక్టర్ ఆఫీస్ నందు సోమవారం డివిజన్ స్థాయి ప్రజావాణి కార్యక్రమం ఆర్డిఓ ఎస్ రమణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డివిజన్ స్థాయిలో పలు శాఖలకు మొత్తం 17 ఫిర్యాదులు రావడం జరిగింది. ఫిర్యాదుల వివరాలు ఇలా ఉన్నాయి సబ్ కలెక్టర్ కార్యాలయానికి 2, తహసిల్దార్ కార్యాలయం మిర్యాలగూడ కు 5, తహసిల్దార్ కార్యాలయం మాడుగులపల్లికి 1,తహసిల్దార్ కార్యాలయం తిరుమలగిరి సాగర్ 2,తహసిల్దార్ కార్యాలయం దామరచర్ల కు 1,తహసిల్దార్ కార్యాలయం పెద్దవూర 1,ఎస్డిపిఓ కార్యాలయం మిర్యాలగూడకు 2, సి డి పి ఓ కార్యాలయం దామరచర్లకు 1,మిర్యాలగూడ మున్సిపల్ కార్యాలయం కు1, డిఎం టీజీ ఆర్టీసీ మిర్యాలగూడ కి 1 ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా ఆర్డీవో ఎస్ రమణారెడ్డి మాట్లాడుతూ ఆర్జీదారులు పెట్టినటువంటి ఫిర్యాదులను సంబంధిత అధికారులకు పంపించి సత్వరమే సమస్యలకు పరిష్కారం చూపాలని ఆదేశించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు శాఖలకు సంబంధించిన డివిజన్ స్థాయి అధికారులు పాల్గొనడం జరిగింది.




# ప్రజావాణి లో పిర్యాదులు స్వీకరిస్తున్న ఎంపీడీఓ మహేష్ నాయక్

**జనగామ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** జనగామ మండల పరిషత్ కార్యాలయంలో ఈరోజు మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. ప్రజల నుండి మొత్తం 9 దరఖాస్తులు/ఫిర్యాదులు స్వీకరించబడినవి. ఎంపీడీఓ గారు నోడల్ అధికారి గా వ్యవహరించి, ప్రజల సమస్యలను సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సత్వర పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టడం జరిగింది. ప్రతి దరఖాస్తును నమోదు చేసి, సంబంధిత శాఖలకు తదుపరి చర్యల కోసం పంపించడం జరిగింది. ప్రజల సమస్యలకు తక్షణ స్పందన – మెరుగైన సేవలే లక్ష్యం.

# భర్త మందలించడంతో... మనస్థాపంతో వివాహిత ఆత్మహత్య



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్ తేదీ 30-08-2026 నాడు సాయంత్రం సుమారు 7:00 గంటల సమయంలో, మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామంలోని దుర్గానగర్‌కు చెందిన కొమేర సైదమ్మ(39 సం”)తన ఇంటి వద్ద పురుగుల మందు సేవించిన సంఘటన జరిగింది. మిర్యాలగూడ రూరల్ ఎస్సై లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం కొమెరా సైదమ్మను ఆమె భర్త గణేష్ ఆమెను మద్యం సేవించవద్దని,పిల్లలు చిన్నవారిగా ఉన్నారని సూచించడంతో ఆమె మనస్తాపానికి గురైనట్లు ప్రాథమికంగా దర్యాప్తులో తెలిసిందన్నారు. అనంతరం ఆమె భర్త బయటకు వెళ్లిన సమయంలో కార్బోఫురాన్ 3% పురుగుల మందును నీటిలో కలుపుకుని సేవించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. పురుగుల మందు సేవించిన విషయం గమనించిన వెంటనే ఆమె మామ కొమేర పరమేష్ మరియు కుమారుడు సాయితేజ ఆమెను ఆటోలో మిర్యాలగూడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ విధుల్లో ఉన్న వైద్యాధికారి ఆమెకు ప్రథమ చికిత్స అందించినప్పటికీ,చికిత్స పొందుతూ సుమారు 8:00 గంటలకు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారన్నారు. ఈ సంఘటనపై మృతురాలి తల్లి పిట్టల జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయబడిందనీ. సంఘటనకు గల పూర్తి కారణాలు మరియు ఇతర అంశాలపై పోలీసుల దర్యాప్తు కొనసాగుతోందనీ తెలిపారు.

# కాంగ్రెస్ మోసపూరిత హామీలపై రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నిరసనలు...



**మిర్యాలగూడ ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** మిర్యాలగూడ పట్టణం రెడ్డి కాలనీలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్ రావు,కంచర్ల భూపాల్ రెడ్డి,తిప్పన విజయసింహ రెడ్డి లతో కలిసి సోమవారం ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన 420 హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 8వ తేదీ వరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 3 వ తారిఖు నాడు మిర్యాలగూడలో చేపట్టే రైతు సదస్సులలో భాగంగా ఆ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ,మాజీ మంత్రి కేటీఆర్ హాజరుఅవుతారని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని,ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే నిరసన కార్యక్రమాల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల దృష్టికి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చింతరెడ్డి శ్రీనివాస రెడ్డి,దుర్గంపూడి నారాయణ రెడ్డి,ఎడవెల్లి శ్రీనివాస రెడ్డి,అన్నబీమోజు నాగార్జున చారి, ధనావత్ చిట్టిబాబు నాయక్,ధనావత్ బాలాజీ నాయక్,కుందూరు వీరకోటి రెడ్డి,కుర్ర సేవ్యా నాయక్, చౌగాని బిక్షం గౌడ్,అమరావతి సైదులు తో పాటు బీఆర్ఎస్ యువజననాయకులు,మాజీ కౌన్సిలర్ లు,నియోజకవర్గ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.


# అనాథ చిన్నారులకు అండగా




**సూర్యాపేట / దురాజ్పల్లి, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** ఉంద్రుగొండ సమీపంలోని శ్రీ స్వామినారాయణ గురుకుల్ ఇంటర్నేషనల్ స్కూల్, విద్యార్థులు సమాజ సేవలో భాగంగా సూర్యాపేటలోని చార్లెట్ పిల్లల అనాథాశ్రమాన్ని సందర్శించి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అనాథాశ్రమంలోని చిన్నారులకు అవసరమైన నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు మరియు ఇతర విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. విద్యార్థులు చిన్నారులతో ఆప్యాయంగా మమేకమై, వారితో సమయం గడుపుతూ ప్రేమ, ఆదరణ మరియు ప్రోత్సాహాన్ని అందించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు “సేవే పరమో ధర్మః” అనే సందేశాన్ని ఆచరణలో చూపించారు. నిస్వార్థ సేవాభావం వంటి మానవీయ విలువలను పెంపొందించుకోవడంలో ఈ కార్యక్రమం విశేష పాత్ర పోషించింది. ఇట్టి కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రిన్సిపల్ CH. శ్రీనివాస్ ఆనంద్ గారు మాట్లాడుతూ అనాథ చిన్నారుల ముఖాల్లో చిరునవ్వులు పూయించడమే కాకుండా, వారి జీవితాల్లో ఆశాకిరణాలను నింపిన ఈ సేవా కార్యక్రమం అందరికీ ఆదర్శంగా నిలిచిందని .విద్యార్థులలో సామాజిక బాధ్యతను పెంపొందించే ఇటువంటి కార్యక్రమాలు భవిష్యత్తులో మరింతగా నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, అనాధ శరణాలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రిన్సిపల్
శ్రీ స్వామినారాయణ గురుకుల్ ఇంటర్నేషనల్ స్కూల్
సూర్యాపేట.

# గిరిజన యూవకుడు పరమేష్ పై దాడి చేసిన కోడేరు ఎస్ ఐ వేణుగోపాల్





**కోడేరు,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** గిరిజన యూవకునిపై అక్రమ కేసు పెట్టి దాడి చేసిన కోడేరు ఎస్ ఐ సస్పెండ్ చేయాలి అని బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా ఫ్లాష్ ఇండియా ప్రతినిధి కోడేరు31(ఆగస్టు) నాగర్ కర్నూల్ జిల్లా కోడేరు మండల కేంద్రంలో ఉద్రుకత గిరిజన నేత పరమేష్ నాయక్ పై కోడేరు ఎస్ ఐ వేణుగోపాల్ దాడి, కాంగ్రెస్ బీజేపీ మధ్య సోషల్ మీడియా లో పోస్టుల పై కాంగ్రెస్ నేత పాండు నాయక్ పిర్యాదు, దాడిని ఖండిస్తూ బీజేపీ నేత ఎల్లేని సుధాకర్ రావు కార్యకర్తల పోలీస్ స్టేషన్ ముట్టడి ప్రయత్నం అడ్డుకున్న పోలీసులు రోడ్డు పై బైటయించిన బీజేపీ నేతలు కోడేరు ఎస్ ఐ ని వెంటనే సస్పెండ్ చేయాలి అని డిమాండ్,



# పేకాటరాయుళ్ల అరెస్టు

**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మిర్యాలగూడ ఒకటో పట్టణం పోలీస్ స్టేషన్ పరిధిలో ఏడుగురు పేకాట ఆడే వ్యక్తులనును అరెస్టు చేసినట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ పత్రిక ముఖంగా తెలియజేశారు. పూర్తి వివరాల్లోకెళ్తే మిర్యాలగూడ ఒకటవ పట్టణ ఇన్స్పెక్టర్ ఎం.నాగభూషణ రావు ఆదేశాల మేరకు మిర్యాలగూడ-I టౌన్ పోలీస్ స్టేషన్ వి ప్రవీణ్ కుమార్ వారి సిబ్బందితో సంయుక్తముగా నమ్మదగిన సమాచారం మేరకు మిర్యాలగూడ టౌన్ బాపూజీ నగర్ లోని సకినాల ప్రదీప్ తండ్రి వెంకన్న ఇంటి మీద దాడి చేశారు. అక్కడ ఏడుగురు వ్యక్తులు సకినాల ప్రదీప్ ూ/శీ వెంకన్న, బొంత సతీష్, తండ్రి వెంకన్న, మాదాని ఆకాష్ తండ్రి శ్రీనివాస్,కుంచం సైదులు తండ్రి లింగయ్య,పండగ చైతన్య తండ్రి గోపయ్య,జోగునూరు నరేష్,తండ్రి సుధాకర్,తుర్క వెంకటేష్ తండ్రి నాగేందర్ డబ్బులు బెట్టింగ్ పెట్టి అందర్ బాహర్ మూడుముక్కల పేకాట ఆడుతున్నారు. ఇట్టి ఏడుగురు వ్యక్తులను మరియు స్వాధీనపరచుకున్న రు. 7100/- మరియు 52 పేక ముక్కలను పోలీస్ స్టేషన్ కు తీసుకొని వచ్చి కేసు నమోదు చేశారు. కేసు ధర్యాప్తులో ఉన్నది.

# శ్రీలంకకు ఐసీసీ షాక్..



శ్రీలంక క్రికెట్ అభిమానులకు షాక్ ఇచ్చే పరిణామం చోటుచేసుకుంది. 2027 ప్రారంభంలో జరగాల్సిన మహిళల ఛాంపియన్స్ ట్రోఫీకి ఆతిథ్యం ఇవ్వాల్సిన శ్రీలంక హక్కులను అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ వెనక్కి తీసుకుంది. శ్రీలంక క్రికెట్ బోర్డులో ప్రభుత్వ, రాజకీయ జోక్యం కొనసాగుతున్న నేపథ్యంలో ఐసీసీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. అయితే ఈ టోర్నమెంట్‌ను ఇప్పుడు ఏ దేశంలో నిర్వహిస్తారనే విషయంపై ఐసీసీ ఇంకా అధికారిక ప్రకటన చేయలేదు.

**ఎందుకు తొలగించారు?**

శ్రీలంక క్రికెట్ బోర్డు వ్యవహారాల్లో ప్రభుత్వ, రాజకీయ జోక్యం చాలా కాలంగా వివాదాస్పదంగా ఉంది. ఐసీసీ నిబంధనల ప్రకారం సభ్య దేశాల క్రికెట్ బోర్డులు ప్రభుత్వ జోక్యం లేకుండా స్వతంత్రంగా పనిచేయాలి. ఈ విషయంలో శ్రీలంక క్రికెట్ వ్యవస్థలో అవసరమైన మార్పులు చేయాలని ఐసీసీ పలుమార్లు సూచించినప్పటికీ, పరిస్థితిలో ఆశించిన మార్పు రాలేదని సమాచారం. దీంతో ఐసీసీ కఠిన నిర్ణయం తీసుకుని మహిళల ఛాంపియన్స్ ట్రోఫీ ఆతిథ్య హక్కులను శ్రీలంక నుంచి తొలగించినట్లు తెలుస్తోంది.

**శ్రీలంక క్రికెట్ అధికారి ఏం చెప్పారు?**

మహిళల ఛాంపియన్స్ ట్రోఫీ ఇక శ్రీలంకలో జరగదనే విషయాన్ని శ్రీలంక క్రికెట్ అధికారి ప్రకాష్ షఫ్టార్ ధృవీకరించినట్లు సమాచారం. టోర్నమెంట్‌ను మరో దేశానికి తరలించే ప్రక్రియ జరుగుతోందని తెలిపారు. అయితే కొత్త ఆతిథ్య దేశం ఇంకా ఖరారు కాలేదని, దీనిపై అధికారిక వివరాలు త్వరలో వెల్లడవుతాయని పేర్కొన్నారు.

**భారత్‌కు ఆతిథ్య అవకాశం?**

శ్రీలంక నుంచి ఆతిథ్య హక్కులు తొలగించిన నేపథ్యంలో తదుపరి వేదికగా భారత్ పేరు కూడా పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి నిర్ణయం వెలువడలేదు. కొత్త ఆతిథ్య దేశాన్ని అక్టోబర్‌లో జరిగే ఐసీసీ బోర్డు సమావేశంలో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

**ఆరు జట్లతో మహిళల ఛాంపియన్స్ ట్రోఫీ**

2027 మహిళల ఛాంపియన్స్ ట్రోఫీని ఆరు జట్లతో నిర్వహించనున్నారు. ఈ టోర్నమెంట్ ఫిబ్రవరి 14 నుంచి 18 వరకు జరగాల్సి ఉంది. టోర్నమెంట్ అర్హత నిబంధనల ప్రకారం ఆతిథ్య దేశంతో పాటు ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో ఉన్న జట్లకు అవకాశం ఉంటుంది. దీంతో శ్రీలంక ఆతిథ్య హక్కులు కోల్పోవడం ఆ జట్టు టోర్నమెంట్ అర్హతపైనా ప్రభావం చూపే అవకాశం ఉంది.

**శ్రీలంక మహిళల జట్టుకు భారీ దెబ్బ?**

ప్రస్తుతం శ్రీలంక మహిళల జట్టు ఐసీసీ ర్యాంకింగ్స్‌లో ఆరో స్థానంలో ఉన్నట్లు సమాచారం. ఆతిథ్య దేశంగా శ్రీలంకకు లభించాల్సిన ప్రత్యేక అవకాశం ఇప్పుడు లేకపోవడంతో, టోర్నమెంట్‌లో ఆ జట్టు పాల్గొనడం ప్రశ్నార్థకంగా మారింది. అయితే తుది అర్హతలు, పాల్గొనే జట్లపై ఐసీసీ అధికారిక నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

**రెండోసారి ఆతిథ్య హక్కులు కోల్పోయిన శ్రీలంక**

గత కొన్నేళ్లలో శ్రీలంకకు ఐసీసీ టోర్నమెంట్ ఆతిథ్య హక్కులు కోల్పోవడం ఇది మరోసారి. గతంలో కూడా ప్రభుత్వ జోక్యానికి సంబంధించిన సమస్యల కారణంగా శ్రీలంకపై ఐసీసీ చర్యలు తీసుకుంది. 2023లో 2024 పురుషుల అండర్-19 ప్రపంచకప్ ఆతిథ్య హక్కులను కూడా శ్రీలంక నుంచి తొలగించి దక్షిణాఫ్రికాకు అప్పగించారు.

**ముందున్నది ఏంటి?**

మహిళల ఛాంపియన్స్ ట్రోఫీ షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలనే ఉద్దేశంతో ఐసీసీ ముందుకు సాగుతోంది. అయితే కొత్త వేదిక ఎక్కడ అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. భారత్‌కు ఆతిథ్య అవకాశం దక్కుతుందా? లేక మరో దేశాన్ని ఎంపిక చేస్తారా? అనేది అక్టోబర్‌లో జరిగే ఐసీసీ బోర్డు సమావేశం తర్వాత స్పష్టమయ్యే అవకాశం ఉంది. మొత్తంగా, శ్రీలంక క్రికెట్‌లో ప్రభుత్వ జోక్యంపై కొనసాగుతున్న వివాదం మరోసారి ఆ దేశానికి భారీ దెబ్బగా మారింది. మహిళల ఛాంపియన్స్ ట్రోఫీ ఆతిథ్య హక్కులను కోల్పోవడంతో పాటు, శ్రీలంక మహిళల జట్టు టోర్నమెంట్‌లో పాల్గొనే అవకాశాలపైనా అనిశ్చితి నెలకొంది.



## భారత క్రికెట్‌లో మరో సెన్సేషన్.. కెప్టెన్‌గా వైభవ్ సూర్యవంశీ !

దులీప్ ట్రోఫీ లో సెంట్రల్ జోన్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఈస్ట్ జోన్ కెప్టెన్ ఇషాన్ కిషన్ గాయపడి మైదానాన్ని వీడటంతో యువ ఆటగాడు 'బేబీ బాస్' వైభవ్ సూర్యవంశీ జట్టు కెప్టెన్సీ బాధ్యతలను చేపట్టారు. అయితే, డొమెస్టిక్ క్రికెట్‌లో ఓ టీమ్‌ను వైభవ్ లీడ్ చేయడం ఇదే తొలిసారి కావడం విశేషం. కెప్టెన్సీ బాధ్యతలు అందుకోగానే వైభవ్ చిరునవ్వులు చిందిస్తూ గ్రౌండ్‌లో జట్టును నడిపించేందుకు సిద్ధమయ్యారు. మైదానంలో మహమ్మద్ షమీ, ముకేశ్ కుమార్ వంటి అంతర్జాతీయ అనుభవం ఉన్న సీనియర్ ప్లేయర్లకు వైభవ్ సూర్యవంశీ దిశానిర్దేశం చేస్తూ కనిపించాడు. అతి చిన్న వయసులోనే షమీ, ముకేశ్ వంటి సీనియర్ బౌలర్లను వైభవ్ హ్యాండిల్ చేస్తున్న తీరు చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉందంటూ నెట్టింట్లో అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు.

# గంభీర్, అగార్కర్ ప్లాన్ అదేనా?



2027 వన్డే ప్రపంచకప్‌పై టీమిండియా ఇప్పటి నుంచే దృష్టి సారించింది. 2023 ప్రపంచకప్ ఫైనల్లో ఆస్ట్రేలియా చేతిలో ఎదురైన పరాజయానికి ప్రతీకారం తీర్చుకోవాలని భారత జట్టు పట్టుదలగా ఉంది. ఈ నేపథ్యంలో జట్టు కూర్పుపై ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, కెప్టెన్ శుభ్‌మన్ గిల్, చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా మిడిలార్డర్‌లో సరైన బ్యాకప్ లేకపోవడం టీమ్ మేనేజ్‌మెంట్‌ను ఆందోళనకు గురిచేస్తోందని సమాచారం. స్టార్ ఆల్‌రౌండర్లు హార్దిక్ పాండ్య, నితీశ్ కుమార్ రెడ్డి తరచూ గాయాల బారిన పడుతుండటంతో.. అదనపు బౌలింగ్ ఆప్షన్ ఉన్న ఆటగాడి కోసం అన్వేషణ మొదలైంది. మిడిలార్డర్‌లో శ్రేయస్ అయ్యర్‌కు ప్రత్యామ్నాయంగా తిలక్ వర్మను టీమ్ మేనేజ్‌మెంట్ పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఒత్తిడిలోనూ రాణించే సామర్థ్యంతో పాటు బంతితోనూ కొన్ని ఓవర్లు వేయగలగడం తిలక్‌కు కలిసొచ్చే అంశంగా భావిస్తున్నారు. వన్డేల్లో తిలక్ జట్టులోకి వస్తే ప్రధాన బౌలర్లపై భారం కొంత తగ్గుతుందని, అదే సమయంలో జట్టు బ్యాటింగ్-బౌలింగ్ సమతూకం మెరుగవుతుందని గంభీర్, గిల్ భావిస్తున్నట్లు సమాచారం.

**దక్షిణాఫ్రికా పరిస్థితులే అసలు పరీక్ష..**

2027 ప్రపంచకప్ దక్షిణాఫ్రికాలో జరగనుండటంతో అక్కడి పిచ్‌లు, పేస్, బౌన్స్‌ను ఎదుర్కొనే ఆటగాళ్లను ఇప్పటి నుంచే సిద్ధం చేయాలని టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తోంది. ఇక భారత జట్టులో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఫిట్‌నెస్‌పైనా ప్రశ్నలు ఉన్నాయి. ప్రపంచకప్ సమయానికి కేఎల్ రాహుల్ వయసు కూడా 35 ఏళ్లు దాటనుంది. రవీంద్ర జడేజా స్థానంపైనా ఇప్పుడే స్పష్టత లేదని తెలుస్తోంది. ఫిట్‌నెస్ సమస్యల కారణంగా జట్టు ఫీల్డింగ్ ప్రమాణాలు కూడా ప్రభావితం అవుతాయి. కాబట్టి యువ ప్లేయర్లను బ్యాకప్‌గా సిద్ధం చేయాలని మేనేజ్‌మెంట్ భావిస్తున్నట్లు సమాచారం.

**న్యూజిలాండ్ సిరీస్ కీలకం**

ప్రపంచకప్ సన్నాహకాలకు అసలు ఊపొచ్చేది అక్టోబర్‌లో జరిగే న్యూజిలాండ్ పర్యటనతో అని సమాచారం. భారత్ అక్కడ ఐదు వన్డేల సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్‌లో కొత్త కాంబినేషన్లను పరీక్షించడంతో పాటు యువ ఆటగాళ్లకు అవకాశాలు ఇచ్చే అవకాశం ఉంది. సెప్టెంబర్ 27 నుంచి వెస్టిండీస్‌తో భారత్ మూడు వన్డేల సిరీస్ ఆడనుంది. అయితే ఆసియా క్రీడల్లో పాల్గొనేందుకు జపాన్‌కు పూర్తి స్థాయి టీ20 జట్టు వెళ్లే అవకాశం ఉండటంతో.. పలువురు సీనియర్ ఆటగాళ్లు వెస్టిండీస్ సిరీస్‌కు దూరంగా ఉండొచ్చని తెలుస్తోంది.

# బిజినెస్

## తగ్గిన బంగారం ధరలు..



గత రెండు రోజుల నుంచి బంగారం ధరలు తగ్గుతూ పోతున్నాయి. రోజు (సోమవారం) 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారంపై 1,470 రూపాయలు.. 22 క్యారెట్ల బంగారంపై 1350 రూపాయలు..18 క్యారెట్ల బంగారంపై 830 రూపాయలు తగ్గింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం.. ఉదయం 10 గంటల ప్రాంతంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 1,56,770 రూపాయల వద్ద.. 22 క్యారెట్ల బంగారం ధర 1,43,700 రూపాయల వద్ద.. 18 క్యారెట్ల బంగారం ధర 1,17,850 రూపాయల వద్ద ట్రేడ్ అవుతోంది.

## గ్యాస్ సిలిండర్ ధరలు

ఇటీవల కేంద్ర ప్రభుత్వం కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరల పై కీలక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. హోటళ్లు, రెస్టారెంట్లు, టీ స్టాల్స్ తదితర వ్యాపారులకు ఊరటనిస్తూ కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించింది. 19 కేజీల కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్‌పై రూ.206 తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. తగ్గిన ఈ ధరలు ఆగస్టు 1వ తేదీ నుంచి అమల్లోకి వచ్చాయి. దీంతో ప్రస్తుతం హైదరాబాద్‌లో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ.2,985గా ఉంది. ఇదిలా ఉంటే.. గత నెల(జులై)తో పోలిస్తే గృహ వినియోగ ఎల్‌పిజి ధరలో ఎలాంటి మార్పు నమోదు కాలేదు. ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో గ్యాస్ సిలిండర్ ధరలు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం.



**ఆగస్టు 31వ తేదీ నాటి గ్యాస్ సిలిండర్ ధరలు**

హైదరాబాద్: రూ.994.00
వరంగల్: రూ.1013.00
విశాఖపట్నం: రూ.950.00
విజయవాడ: రూ.966.50
గుంటూరు: రూ.966.50

# నాణ్యతా నిబంధనల అడ్డంకి



మనదేశంలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) అమలు చేస్తున్న తప్పనిసరి నాణ్యతా ధృవీకరణ విధానం (క్యూసీఓ) విదేశీ పెట్టుబడిదారులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. టోక్యో పర్యటనలో భాగంగా హై-టెక్నాలజీ పరిశ్రమలకు ఈ నాణ్యతా నిబంధనల నుండి మినహాయింపు ఇస్తామని కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ ప్రకటించినప్పటికీ, కేవలం ఒక రంగానికే ఉపశమనం ఇవ్వడం వల్ల పూర్తి సమస్య పరిష్కారం కాదని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ (జీటీఆర్ఐ) తన తాజా నివేదికలో వెల్లడించింది. దేశంలో తయారీ రంగాన్ని పెంచాలనే లక్ష్యానికి ఈ క్లిష్టమైన సర్టిఫికేషన్ నిబంధనలు పెద్ద ప్రతిబంధకంగా మారుతున్నాయని జీటీఆర్ఐ వ్యవస్థాపకులు అజయ్ శ్రీవాస్తవ స్పష్టం చేశారు.

**జపనీస్ కంపెనీలపై ప్రభావం**

జపాన్ ఎక్స్‌టర్నల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (జేఈటీఆర్ఓ) జరిపిన సర్వే ప్రకారం, భారత్‌లో పనిచేస్తున్న 71.9 శాతం జపనీస్ కంపెనీలు బీఐఎస్ సర్టిఫికేషన్ వల్ల తమ వ్యాపారం దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశాయి. ముఖ్యంగా సాధారణ యంత్రాల తయారీదారుల్లో 92.3 శాతం, రవాణా పరికరాల కంపెనీల్లో 76.8 శాతం సంస్థలు ఈ నిబంధనల వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఇతర దేశాల్లో ఇప్పటికే నాణ్యతా పరీక్షలు పూర్తి చేసుకున్న ఉత్పత్తులకు కూడా భారత్‌లో మళ్లీ సుదీర్ఘమైన తనిఖీలు, డాక్యుమెంటేషన్, అధికారుల విదేశీ ఫ్యాక్టరీ పర్యటనలు నిర్వహించడం వల్ల సమయం, డబ్బు వృథా కావడమే కాక 42.7 శాతం వ్యాపారాల అమ్మకాలు నిలిచిపోయాయని నివేదిక తెలిపింది.

**సంక్లిష్టమైన లైసెన్సింగ్ విధానం**

ప్రస్తుత బీఐఎస్ ధృవీకరణ వ్యవస్థ నాణ్యతను పెంచడం కంటే ఖరీదైన 'లైసెన్సింగ్ రాజ్'లా మారిందని జీటీఆర్ఐ అభిప్రాయపడింది. ఒక వియత్నామీస్ స్క్రూ తయారీ కంపెనీ ల్యాబ్ పరీక్షల కోసం రూ. 20 లక్షలు, కన్సల్టెన్సీ, తనిఖీల కోసం మరో రూ. 40 లక్షలు చొప్పున మొత్తం రూ. 60 లక్షలు ఖర్చు చేసినప్పటికీ చివరికి తుది బీఐఎస్ నిర్ణయం మాత్రం అందలేదు. అంతేకాకుండా ఉక్కు వంటి ముడిసరుకులకు, తుది ఉత్పత్తులకు వేర్వేరుగా ఇచ్చే 'డబుల్ సర్టిఫికేషన్', క్యూసీఓ పరిధిలోకి రాని ఉత్పత్తులకు కూడా మినహాయింపు జాబితాల పేరుతో అదనపు పత్రాలు కోరడం వల్ల చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్‌ఎంఈలు) తీవ్రంగా నష్టపోతున్నాయి.

**యూరోపియన్ తరహా సంస్కరణల అవసరం**

ఈ సమస్యల పరిష్కారానికి యూరోపియన్ యూనియన్ అనుసరిస్తున్న 'ప్రమాద-ఆధారిత' నియంత్రణ వ్యవస్థను భారత్ కూడా స్వీకరించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ విధానంలో తయారీదారులే స్వయంగా తమ ఉత్పత్తుల నాణ్యతకు హామీ ఇస్తూ 'సీఈ మార్క్' ఉపయోగించుకోవచ్చు. ప్రభుత్వం ముందస్తు పర్మిషన్లు, తనిఖీల పేరుతో వేధించకుండా, కేవలం ప్రజారోగ్యం, భద్రతకు ముప్పు కలిగించే కీలక ఉత్పత్తులకే బీఐఎస్ ముందస్తు రిజిస్ట్రేషన్ పరిమితం చేయాలి. తక్కువ రిస్క్ ఉన్న ఉత్పత్తులకు మార్కెట్ పర్యవేక్షణ, ఉల్లంఘనలు జరిగితే జరిమానాలు విధించే పద్ధతిని అమలు చేయాలి.


**ఎగుమతులకు ఎదురయ్యే సవాళ్లు**

ఫర్నిచర్, పాదరక్షలు వంటి నిత్యావసర వస్తువులకు కూడా తప్పనిసరి సర్టిఫికేషన్ విధించడం వల్ల వస్తువుల ధరలు పెరిగి వినియోగదారులపై భారం పడుతుందని, వీటిని నాణ్యత ఆధారిత మార్కెట్ పోటీకే వదిలేయాలని నివేదిక స్పష్టం చేసింది. భారత్ అనుసరిస్తున్న ఈ విధానాన్ని చూసి ఇతర దేశాలు కూడా రేపు భారతీయ ఎగుమతులపై ఇలాంటి కఠిన నిబంధనలే విధిస్తే, మన కంపెనీలు భారీగా అదనపు తనిఖీ ఖర్చులు భరించాల్సి వస్తుంది. అందువల్ల 'మేక్ ఇన్ ఇండియా' విజయం సాధించాలన్నా, విదేశీ పెట్టుబడులు రావాలన్నా ప్రభుత్వం ఈ క్యూసిఓ (క్యూసీఓ) ఫ్రేమ్‌వర్క్‌పై తక్షణమే ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించి సమగ్ర సంస్కరణలు చేపట్టడం అత్యవసరం.




## ఈ ఏడాది ఇండియన్ బ్యాంక్ 100 కొత్త బ్రాంచ్‌ల ఏర్పాటు

ప్రభుత్వ రంగ ఇండియన్ బ్యాంక్ తన వ్యాపారాన్ని మరింత విస్తరించేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశంలోని ఇతర ప్రాంతాలపై దృష్టి సారిస్తూ 100 కొత్త బ్రాంచులను ప్రారంభించడంతో పాటు, స్పెషలిస్ట్ ఆఫీసర్లు సహా 2,500 మంది కొత్త సిబ్బందిని నియమించుకోనున్నట్లు ఎండీ, సీఈఓ బినోద్ కుమార్ వెల్లడించారు. ఈ ఏడాది జూన్ 30 నాటికి దేశీయంగా 6,003 బ్రాంచ్‌లు, 41,875 మంది ఉద్యోగులు ఉన్న ఈ బ్యాంక్, తన గోల్డ్ లోన్స్ పోర్ట్‌ఫోలియోను 20 శాతం వృద్ధి రేటుతో రూ. 1.25 లక్షల కోట్ల నుంచి రూ. 1.5 లక్షల కోట్లకు తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే, స్థూల మొండి బకాయిలను 1.5-1.6 శాతానికి తగ్గించడమే కాకుండా, రూ. 200 కోట్ల బ్యాడ్ లోన్స్‌ను అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీకి విక్రయించి నికర నిరర్థక ఆస్తులను అదుపులోకి తీసుకొస్తామని బ్యాంకు పేర్కొంది. ప్రస్తుతం మొత్తం రుణాల్లో రిటైల్, వ్యవసాయం, ఎంఎస్‌ఎంఈలు కలిపి 65 శాతం వాటా కలిగి ఉండగా, కార్పొరేట్ రుణాలు 35 శాతంగా ఉన్నాయని వెల్లడించింది.




# థ్రిల్లింగ్ కాన్సెప్ట్‌తో వస్తున్న...

వరుస ఫ్లాపులతో సినిమాలకు కాస్త గ్యాప్ ఇచ్చిన యంగ్ హీరో రాజ్ తరుణ్, ఈసారి ఒక సస్పెన్స్ అండ్ ఇంటెన్స్ యాక్షన్ థ్రిల్లర్‌తో గట్టిగా కంబ్యాక్ ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. "నిద్రలో నడిచే ఆ యంగ్ హీరో ఎవరు?" అంటూ గత రెండు రోజులుగా సోషల్ మీడియాలో అవసరాల శ్రీనివాస్ నడిపిన ప్రమోషన్లు సినీ ప్రియుల్లో తీవ్ర ఉత్కంఠను రేకెత్తించాయి. తాజాగా, ఈ సస్పెన్స్‌కు తెరదించుతూ.. మేకర్స్ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను షేర్ చేసి అందరినీ ఆశ్చర్యపరిచారు. అయితే ఈ చిత్రానికి 'టార్టాయిస్' అనే వెరైటీ టైటిల్‌ను ఖరారు చేస్తూ విడుదల చేసిన పోస్టర్ ప్రేక్షకులకు గూస్‌బంప్స్ తెప్పిస్తోంది. ఫస్ట్ లుక్‌లో ఒక రక్తంతో ఉన్న మృతదేహం పక్కన, ఒంటి నిండా రక్తపు మరకలతో గుర్తుపట్టలేని విధంగా రాజ్ తరుణ్ కూర్చుని ఉండటం, ఆయన పక్కనే ఒక కత్తి, తాబేలు కనిపిస్తుండటం సినిమాపై అంచనాలను పెంచేసింది. "రాత్రి మొదలైతే అతడి కథ మొదలవుతుంది.. నిద్రలో నడిచే అతడి అడుగులు ఎటు దారితీస్తాయో?" అనే క్యాప్షన్ కథలోని తీవ్రతను సూచిస్తోంది. దర్శకుడు రిత్విక్ కుమార్ తెరకెక్కిస్తున్న ఈ మైండ్ బ్లోయింగ్ థ్రిల్లర్‌లో అమృత చౌదరి హీరోయిన్‌గా నటిస్తుండగా, అవసరాల శ్రీనివాస్, ధన్యా బాలకృష్ణ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రశ్వితా ఎంటర్‌టైన్‌మెంట్స్, NVL క్రియేషన్స్, SK గోల్డెన్ ఆర్ట్స్ పతాకాలపై విజయ్ చౌదరి, శశిధర్ నల్ల, రామిశెట్టి రాంబాబు నిర్మిస్తున్నారు. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ సినిమా త్వరలోనే థియేటర్స్‌లోకి రాబోతుంది.


# 'లైకీ లైకా' మూవీ విడుదల వాయిదా..!

'ఆజాద్' సినిమాతో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టి ప్రేక్షకులను మెప్పించిన యంగ్ బ్యూటీ రాషా తడాని, తెలుగులో 'శ్రీనివాస మంగాపురం' చితంలో నటించారు. అయితే ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో రాణించలేకపోయినా, ఈ భామ క్రేజ్ మాత్రం తగ్గలేదు. ప్రస్తుతం ఆమె అభయ్ వర్మ సరసన 'లైకీ లైకా' అనే విభిన్నమైన రొమాంటిక్ యాక్షన్ డ్రామాలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. ప్రేమ, నొప్పి, నమ్మకం అనే అంశాల చుట్టూ తిరిగే ఈ చిత్రానికి సౌరభ్ గుప్తా దర్శకత్వం వహిస్తున్నారు. నిజానికి ఈ చిత్రాన్ని ఈ ఏడాది వేసవి కానుకగా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేసినప్పటికీ, రీషూట్స్ కారణంతో పాటు ఒక ప్రత్యేక కారణం వల్ల ఈ సినిమాను 2027 ఫిబ్రవరికి వాయిదా వేస్తున్నట్లు సమాచారం.తన తొలి చిత్రం 'ఆజాద్'లోని 'ఉయి అమ్మ' పాట ద్వారా రాషా తన డ్యాన్స్‌తో విపరీతమైన పాపులారిటీ సొంతం చేసుకున్నారు. 'లైకీ లైకా' చిత్రంలో కూడా ఆమె పాత్ర ఒక డ్యాన్సర్ కావడం వల్ల, అదే తరహాలో రాషా ఇమేజ్‌కు తగ్గట్టుగా ఒక ప్రత్యేకమైన డ్యాన్స్ నంబర్‌ను ఈ సినిమాలో చేర్చి అభిమానులకు సర్‌ప్రైజ్ ఇచ్చేందుకు చిత్ర బృందం నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ కొత్త పాట చిత్రీకరణ కోసమే సినిమా విడుదలను వాయిదా వేసినట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి నెల వాలెంటైన్స్ డేకు ఈ గాఢమైన ప్రేమకథను థియేటర్స్‌లోకి తీసుకురాబోతున్నట్లు టాక్.




# ఎందుకీ సైలెన్స్?

కన్నడ స్టార్ నటుడు యష్ తాజాగా 'టాక్సిక్' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. ఆగస్టు 26న భారీ అంచనాల నడుమ కన్నడ, తెలుగు, తమిళ, హిందీ, మలయాళ భాషలతో పాటు ఇంగ్లీష్‌లోనూ ఈ చిత్రం విడుదలైంది. ఈ సినిమాకు హిందీలో మంచి కలెక్షన్లు వస్తున్నప్పటికీ, ఇతర ప్రాంతాల్లో మాత్రం ఆశించిన స్థాయిలో వసూళ్లు దక్కడం లేదని తెలుస్తోంది. ఇక ఇంగ్లీష్‌లోనూ ఈ సినిమా విడుదల కావడంతో అక్కడ ఎలాంటి ఆదరణ లభిస్తుందోనని చాలామంది ఆసక్తిగా ఎదురుచూశారు. అయితే ఇంగ్లీష్ వెర్షన్‌కు సంబంధించిన వసూళ్లపై మేకర్స్ ఇప్పటివరకు ఎలాంటి అప్‌డేట్ ఇవ్వడం లేదు. దీంతో 'టాక్సిక్'ను ఇంగ్లీష్‌లో విడుదల చేసినా పెద్దగా ప్రయోజనం లేకుండా పోయిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ చిత్రాన్ని కన్నడతో పాటు ఇంగ్లీష్‌లోనూ చిత్రీకరించారు. ఇంత కష్టపడి ఇంగ్లీష్‌లో చిత్రీకరించినప్పటికీ, అక్కడ ఈ మూవీకి ఆశించిన స్థాయిలో వసూళ్లు రాకపోవడంతో మేకర్స్ కష్టం వృథా అయిందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.



# ట్రైలర్ కు టైమ్ ఫిక్స్



తమిళ స్టార్ హీరో కార్తీ డ్యూయల్ రోల్‌లో నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ స్పై యాక్షన్ థ్రిల్లర్ సీక్వెల్ 'సర్దార్ 2'. ఇందులో ఎస్.జె. సూర్య మెయిన్ విలన్‌గా నటిస్తుండగా, మాళవిక మోహనన్ కథానాయికగా నటిస్తోంది. పి.ఎస్. మిత్రన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో టాలీవుడ్ సీనియర్ నటుడు రాజేంద్ర ప్రసాద్, తెలుగు నటి అషు రెడ్డి కీలక పాత్రలు పోషిస్తుండగా, సామ్ సి.ఎస్. దీనికి సంగీతాన్ని అందిస్తున్నారు. దసరా కానుకగా 2026 సెప్టెంబర్ 10న ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కాబోతోంది. ఈ మూవీ ట్రైలర్ రిలీజ్ గురించి మేకర్స్ నుంచి ఒక అప్డేట్ వచ్చేసింది. 'సర్దార్ 2' ట్రైలర్ ను ఈరోజు రాత్రి 8:15 గంటలకు విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. దీంతో ట్రైలర్‌లో కార్తి ఎలాంటి యాక్షన్‌తో కనిపించబోతున్నారనే ఆతృత అభిమానుల్లో మొదలైంది.'సర్దార్' మొదటి భాగం దీపావళి కానుకగా 2022 అక్టోబర్ 21న థియేటర్లలో విడుదలవ్వగా, దాదాపు ₹40 కోట్ల బడ్జెట్‌తో ₹100 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను సాధించి హిట్ టాక్ సొంతం చేసుకుంది. పి.ఎస్. మిత్రన్ దర్శకత్వంలో రాశి ఖన్నా, రజిషా విజయన్ కథానాయికలుగా నటించిన ఈ చిత్రం ఆంధ్రా, తెలంగాణల్లోనూ ₹15 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసి డిస్ట్రిబ్యూటర్లకు లాభాలను తెచ్చిపెట్టింది. పి.ఎస్. మిథ్రన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సీక్వెల్‌లో కార్తి మరోసారి స్పై ఏజెంట్ పాత్రలో కనిపించనున్నారు. 'సర్దార్' తొలి భాగం మంచి విజయం సాధించడంతో రెండో భాగంపై కూడా ప్రేక్షకుల్లో అంచనాలు ఉన్నాయి. ప్రిన్స్ పిక్చర్స్ బ్యానర్‌పై భారీ స్థాయిలో తెరకెక్కుతున్న ఈ మూవీని పలు భాషల్లో విడుదల చేయడానికి మేకర్స్ సిద్ధమవుతున్నారు. తొలి భాగం ఇచ్చిన సక్సెస్‌ను సీక్వెల్ ఎంతవరకు కొనసాగిస్తుందో, ఇప్పటికే సినిమాపై ఉన్న బజ్‌కు ట్రైలర్ మరింత ఊపు తీసుకొస్తుందా అనేది చూడాలి.

# నెలరోజులు కూడా కాకముందే ఓటీటీలోకి



మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్, టాలెంటెడ్ డైరెక్టర్ మేర్లపాక గాంధీ కాంబినేషన్‌లో వచ్చిన లేటెస్ట్ కామెడీ హారర్ థ్రిల్లర్ 'కొరియన్ కనకరాజు'. రితికా నాయక్ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో హాస్య నటుడు సత్య ఒక కీలకమైన పాత్రలో కనిపించారు. ఆగస్ట్ 7న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం, బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లను సాధించడంతో పాటు ప్రేక్షకులను విశేషంగా అలరించింది. ఒకే శరీరంలో రెండు ఆత్మలు ప్రవేశిస్తే ఎలాంటి పరిస్థితులు ఎదురవుతాయి? అనే ఆసక్తికరమైన కాన్సెప్ట్‌తో ఈ సినిమాను రూపొందించారు.ముఖ్యంగా వరుణ్ తేజ్, సత్యల మధ్య వచ్చిన కామెడీ సన్నివేశాలు థియేటర్లలో ప్రేక్షకులకు విపరీతంగా నవ్వులు పూయించి, సినిమాకు ప్రధాన హైలైట్‌గా నిలిచాయి. హారర్ ఎలిమెంట్స్‌కు కామెడీని జోడించి దర్శకుడు మేర్లపాక గాంధీ తెరకెక్కించిన విధానం అందరినీ ఆకట్టుకుంది. కాగా, థియేటర్లలో విడుదలైన నెల రోజులు కూడా కాకముందే ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది. 'కొరియన్ కనకరాజు' చిత్రానికి సంబంధించిన డిజిటల్ రైట్స్‌ను ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ భారీ ధరకు సొంతం చేసుకుంది. ఈ సినిమాను సెప్టెంబర్ 4 నుంచి డిజిటల్ వేదికపై అందుబాటులోకి తీసుకురాబోతున్నట్లు నెట్‌ఫ్లిక్స్ అధికారికంగా ప్రకటించింది. తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఒకేసారి ఈ చిత్రం స్ట్రీమింగ్ కానుంది.

# ఆ తేదీన విడుదల కానున్న 'దేత్తడి'



రౌడీ బాయ్స్, లవ్ మీ చిత్రాలతో ప్రేక్షకులను పలకరించిన ఆశిష్ ప్రస్తుతం 'దేత్తడి' అనే పక్కా మాస్ కమర్షియల్ సినిమాలో హీరోగా నటిస్తున్నాడు. ప్రసన్న కుమార్ బెజవాడ స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ అందించిన ఈ సినిమాకు ఆదిత్య రావు గంగాసాని దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు, శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సురేష్ బొబ్బిలి సంగీతం అందిస్తున్నారు. ఈ మూవీ షూటింగ్ చాలా రోజుల క్రితమే ప్రారంభమైంది.ఇప్పటికే చాలా భాగం షూటింగ్ పూర్తయినట్లు తెలుస్తోంది. ఇక ఈ మూవీ విడుదల విషయంలో మేకర్స్ దాదాపు ఓ క్లారిటీకి వచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం ఈ చిత్రాన్ని డిసెంబర్ 22న విడుదల చేయాలని మేకర్స్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఇప్పటికే డిసెంబర్ నెలలో చాలా క్రేజీ సినిమాలు విడుదలకు సిద్ధమవుతున్నాయి. మరి ఆ సినిమాలకు పోటీగా 'దేత్తడి' చిత్రాన్ని విడుదల చేస్తారా? లేక ఏమైనా వెనక్కి తగ్గుతారా? అనేది చూడాలి.




# ఆ హీరోయిన్లకే చాన్స్‌లు..

చిత్ర పరిశ్రమలో ఒకే రకమైన పాత్రలకే పరిమితం కావడం చాలా తేలికని, కానీ తాను అలాంటి బౌండరీస్‌లో చిక్కుకుపోవడానికి ఎంతమాత్రం సిద్ధంగా లేనని స్టార్ హీరోయిన్ తాప్సీ పన్ను స్పష్టం చేశారు. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో తన సినీ ప్రయాణం, పాత్రల ఎంపికపై ఆమె పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. ప్రస్తుతం ఇండస్ట్రీలో దాదాపు అందరూ తమ కంఫర్ట్ జోన్‌లోనే ఉంటూ పాత పద్ధతులనే పాటిస్తున్నారని తాప్సీ అన్నారు. ఉదాహరణకు గ్లామరస్ పాత్రల కోసం ఒక ఐదుగురు హీరోయిన్లు, గట్టి సందేశం ఉండే కథల కోసం మరో ఐదుగురు హీరోయిన్లతో ఒక సెట్ ఏర్పడిపోయిందని అన్నారు. తాను కూడా అవే రొటీన్ కథలను ఒప్పుకుంటే ప్రేక్షకులు థియేటర్లో క్లైమాక్స్‌ను సులువుగా ఊహించేస్తారని, అందుకే అలాంటి ఆఫర్లు వచ్చినప్పుడు రిజెక్ట్ చేస్తున్నట్లు చెప్పారు. కొందరు మేకర్స్ వద్దకు వెళ్లి "ఈ పాత్రలో నన్ను తీసుకోకండి, అది మీ సినిమాకే నష్టం కలిగిస్తుంది" అని ముఖంమీదే చెప్పేసి కొన్ని ప్రాజెక్టుల నుంచి తప్పుకున్నానని తెలిపారు. కెరీర్ ప్రారంభంలో తనకు సాధారణ కమర్షియల్ రోల్స్ రాలేదని, ఆ కారణంగానే విభిన్నమైన కథలను ఎంచుకోవాల్సి వచ్చిందని చెప్పారు. అయితే తన అదృష్టం కొద్దీ ఆ తర్వాత అవే మెయిన్‌స్ట్రీమ్ రకమైన కథలుగా మారి విజయం సాధించాయని తాప్సీ పేర్కొన్నారు.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**